



స్ట్రామ్ వాటర్ డ్రెయిన్ పనులపై ప్రశ్నిస్తున్న కలెక్టర్ ప్రశాంతి

వరదలా వానొచ్చే!

రాజమహేంద్రవరం సిటీ, జూలై 21(ఆంధ్రజ్యోతి): జిల్లావ్యాప్తంగా 19 మండలాల్లో సోమవారం 31.4 మి.మీ వర్షపాతం నమోదైంది. గడచిన 24 గంటల్లో అత్యధికంగా అనపర్తి,రాజమహేంద్రవరంలలో వర్షం కురిసింది. తెల్లవారుజామున చిరుజల్లులు పడ్డాయి. మరలా మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు భారీ వర్షం కురిసింది. దీంతో కొన్ని ప్రాంతాల్లో వర్షపు నీరు రోడ్డెక్కింది. మోరంపూడి ఫ్లయ్ ఓవర్‌పై భారీగా నీరు నిలిచిపోయింది. కాలువలా మారిపోయింది. దీంతో ట్రాఫిక్‌ను మళ్లించారు. కోరుకొండ రోడ్డు, పేపరుమిల్లు రోడ్డు, కృష్ణనగర్, కంబాలచెరువు ప్రాంతాల్లో వర్షపునీరు రోడ్లపై ప్రవహించింది. సాయంత్రం విద్యార్థులు ఇళ్లకు చేరుకునే సమయం కావడంతో ఇబ్బందులు పడ్డారు. జిల్లాలో అనపర్తిలో 12.4 మి.మీ, రాజమహేంద్రవరంలో 5 మి.మీ, రూరల్‌లో 4.6 మి.మీ, పెరవలి 3.8 మి.మీ, ఉండ్రాజవరం 3.0 మి. మీ, బిక్కవోలు 1.2 మి.మీ, కడియం 1.2 మి.మీ, వర్షం కురిసింది. రాగల నాలుగు రోజులు పాటు ఒక మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలిపింది.





సోమవారం సాయంత్రం రాజమండ్రిలో కురుస్తున్న వాన

వర్షపు నీరు రోడ్లపై నిలవకూడదు : కలెక్టర్

రాజమహేంద్రవరం సిటీ, జూలై 21(ఆంధ్రజ్యోతి): వర్షపు నీరు రోడ్డుపై నిలవకుండా నిర్మించబోతున్న స్ట్రామ్ వాటర్ డ్రెయిన్ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్, నగర పాలక సంస్థ ఇన్‌చార్జి కమిషనర్ పి.ప్రశాంతి సూచించారు. రాజమహేంద్రవరం వీరభద్రపురంలో జరుగుతున్న పనులను సోమవారం కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇంజనీరింగ్ అధికారులతో పనుల పురోగతిపై సమీక్షించారు. వీరభద్రపురం హనుమాన్ ఆలయం నుంచి సీతంపేట పబ్లిక్ టాయిలెట్స్ మీదుగా కృష్ణనగర్ ప్రగతి ఫర్నిచర్ వరకు రూ.1.95 కోట్లతో చేపడుతున్న స్ట్రామ్ వాటర్ డ్రెయిన్ నిర్మాణ పనుల వివరాలు కలెక్టర్‌కు అధికారులు వివరించారు. పనులు వెంటనే పూర్తి చేసి ప్రారంభించాలని అధికారులను ఆదేశించారు. నగరంలో ఎక్కడా వర్షపు నీరు రోడ్లపై నిలిచే పరిస్థితి ఉండకూడదని సూచించారు.ఆమె వెంట ఎస్ఈ కోటేశ్వరరావు ఉన్నారు.



జ..గన్..మిథున్..!

బాస్ కోసం జిల్లాలో బరితెగింపు

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

వైసీపీ ఎంపీ మిథున్‌రెడ్డి అరాచకాలు, అక్రమాలకు, దందాలకు లెక్కేలేదు. వైసీపీ ఐదేళ్ల పాలనలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా కోఆర్డినేటర్‌గా అధికారం చెలాయించారు. వంతాడ మైనింగ్‌పై కన్నేసి లీజుదారులను బెదిరించి వాటాలు కొట్టేశారు. అప్పటి సీఎం జగన్ భారతి సిమెంట్ కంపెనీకి ఇక్కడి నుంచి రిజర్వ్ ఫారెస్ట్‌ను తవ్వేసి మరీ లేటరైట్ పంపించారు. జగన్ కోసం కాకినాడ పోర్టు,కాకినాడ సెజ్ యజమానులను బెదిరించి వాటాలను అరబిందో కంపెనీకి రాయించడం కోసం ఏకంగా బెదిరింపులకు దిగారు. వందలకోట్ల పేదల ఇళ్ల స్థలాల చదునులో కాకినాడ సిటీ మాజీ ఎమ్మెల్యే ద్వారంపూడితో కలిపి కోట్లకు కోట్లు కొట్టేశారు. గతేడాది జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో మద్యం కుంభకోణంలో సంపాదించిన అక్రమ సొమ్మునే ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో నియోజకవర్గాలకు తరలించి టీడీపీని ఓడించడానికి మిథున్‌రెడ్డి స్కెచ్ అమలుచేశారు. అప్పటి సీఎం జగన్ అండదండలతో ఉమ్మడి జిల్లాలో మిథున్ రెడ్డి రెచ్చిపోయారు. రూ.3,200 కోట్ల మద్యం కుంభకోణంలో కీలక సూత్రధారిగా అరెస్టయి రాజమహేంద్రవరం సెంట్రల్ జైల్లో ఉన్నారు.

బెదిరించి..వాటాలు కొట్టేసి..

కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండలం వంతాడ కొండల్లో లేటరైట్ సిమెంట్ తయారీ, అల్యూమినియం ఉత్పత్తికి ఆధారం. పశ్చిమ గోదావరి జిల్లాకు చెందిన ఆంధ్రు శ్రీనివాస్ 2013లో వంతాడ కొండపై 20 ఏళ్ల పాటు 200 ఎకరాల్లో లీజులు దక్కించుకున్నారు. 41.25 లక్షల మెట్రిక్ టన్నుల లేటరైట్ గనులపై జగన్ ఆదేశాలతో మిథున్‌రెడ్డి కన్నేశారు. లీజుదారుడిని బెదిరించి బలవంతంగా డీల్ కుదిర్చారు. దీని ద్వారా ఏడాదికి అప్పటి ప్రభుత్వ పెద్దలు రూ.180 కోట్లు వెనకేసుకున్నారు.

రిజర్వ్ ఫారెస్ట్ తవ్వించేశారు...

విశాఖ జిల్లా నాతవరం మండలం బమిడికిలొద్దు వద్ద లేటరైట్ కొండలపై జగన్ కన్ను పడింది. లీజుదారుడిని దారికితెచ్చుకుని మిథున్ రెడ్డి వాలిపోయారు. తవ్విన లేటరైట్‌ను జాతీయరహదారి మీదుగా కడపలోని సిమెంట్ ఫ్యాక్టరీకి తరలించే దగ్గర చిక్కొచ్చింది. దీంతో మిథున్‌రెడ్డి పెద్ద స్కెచ్ వేశారు. బమిడికలొద్దు లేటరైట్ క్వారీకి అతి సమీపంలో రౌతులపూడి ఉండడంతో క్వారీ నుంచి జల్దాం వరకు రహదారిని నిర్మించి అక్కడి నుంచి కత్తిపూడి హైవే మీదుగా కడపకు లేటరైట్ తరలింపునకు స్కెచ్ వేశారు. ఈ మేరకు చెల్లూరు-బమిడికలొద్దు మధ్య ఉన్న ఐదు కిలోమీటర్ల పరిధిలో ఉన్న రిజర్వ్‌ఫారెస్ట్‌ను అటవీశాఖ అనుమతుల్లేకుండా తవ్విపారేశారు. ఇక్కడి నుంచి కడపలో భారతి సిమెంట్‌కు లేటరైట్ తరలించేశారు.

ఉమ్మడి జిల్లాతో మిథున్‌రెడ్డికి సంబంధం?

వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత 2022లో కడప జిల్లా రాజంపేట ఎంపీగా ఉన్న పీవీ మిథున్‌రెడ్డిని అప్పటి సీఎం జగన్ ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా కోఆర్డినేటర్‌గా నియమించారు. అప్పటి నుంచీ మిథున్‌రెడ్డి జిల్లాలో చెలరేగిపోయారు. జగన్ మెప్పుకోసం.. జగన్ ఆర్థిక ప్రయోజనాల కోసం అడ్డంగా బరితెగించేశారు. కలెక్టర్లు, ఎస్పీలుగా ఎవరుండాలో ఆయనే డిసైడ్ చేసేవారు. అయితే అప్పటికే జగన్ ప్రభుత్వం తెచ్చిన మద్యం పాలసీలో మిథున్‌రెడ్డి కీలకంగా మారారు. మద్యం ముడుపులు ఎక్కడి నుంచి ఎక్కడికి వెళ్లాలి? ఏ బ్రాండ్‌లను అనుమతించాలి? వంటివన్నీ మిథున్‌రెడ్డి చక్కబెట్టారు. పెద్దాపురం మండలం చినబ్రహ్మదేవంలోని కేబీకే బయోటెక్ నుంచి స్పిరిట్ కొనుగోలులోనూ చక్రం తిప్పినట్టు సమాచారం. ప్రభుత్వం మారాక గతేడాది మద్యం కుంభకోణానికి సంబంధించి సీఐడీ జరిపిన సోదాల్లో చినబ్రహ్మదేవంలోని కేబీకే బయోటెక్ కంపెనీ కూడా ఉంది. డిస్టిలరీల లెక్కలు, కేబీకే నుంచి వెళ్లిన సరుకు లెక్కల్లో వ్యత్యాసాలపై ఆరా తీసింది. తాజాగా ఈ కుంభకోణంలో మిథున్‌రెడ్డి పాత్ర బయటపడడంతో అరెస్టయి రాజమండ్రి సెంట్రల్ జైలుపాలయ్యారు.



సెంట్రల్ జైలులో ఎంపీ మిథున్‌రెడ్డి

లిక్కర్‌స్కామ్‌లో ఏ4, వైసీపీ ఎంపీ పెదిరెడ్డి వెంకట మిథున్‌రెడ్డికి రాజమహేంద్రవరం సెంట్రల్ జైలులో రిమాండ్ ఖైదీ నంబర్ 4196 కేటాయించారు. సెంట్రల్ జైల్ సూపరింటెండెంట్ రాహుల్ కథనం ప్రకారం. ఆదివారం రాత్రి 8:50 గంటలకు నిందితుడిని జైలులోకి తీసుకున్నారు. అతన్ని స్నేహ బ్లాక్ బ్యారక్‌లో ఉంచారు.

- కన్నేస్తే ఖాళీ కావాల్సిందే
- నాడు ఉమ్మడి జిల్లా కోఆర్డినేటర్
- ఐదేళ్లూ దందాలు.. దౌర్జన్యాలే
- ఎన్నికల్లో మద్యం, డబ్బు డంపింగ్
- నకిలీ మద్యం నిల్వలు
- లేటరైట్.. అక్రమాలు
- పేదల ఇళ్ల స్థలాల చదును
- కేబీకే బయోటెక్‌లో హస్తం
- లిక్కర్ స్కాంలో జైలుపాలు
- మిథున్‌రెడ్డి అరాచకాలెన్నెన్నో..

ఎన్నికల్లో.. డబ్బు..మందు...

ఉమ్మడి జిల్లా కోఆర్డినేటర్ హోదాలో మిథున్ రెడ్డి గత ఎన్నికల్లో టీడీపీని ఓడించడానికి మద్యం, అక్రమ సొమ్ము వందల కోట్లలో ఇక్కడ డంప్ చేశారు. ఈమేరకు అప్పటి ఎమ్మెల్యే ద్వారంపూడితో స్కెచ్ వేశారు. పిఠాపురంలో పవన్‌ను ఓడించడానికి మిథున్‌రెడ్డి కొన్ని రోజులు జిల్లాలోనే మకాం వేశారు. కడప నుంచి నకిలీ మద్యాన్ని వ్యాన్లలో తరలించారు. ఒక్క పిఠాపురానికి కోట్లలో నకిలీ మద్యం డంప్ చేశారు. పోటీ తీవ్రంగా ఉన్న నియోజకవర్గాలకు రూ.30 కోట్లు, కోట్ల విలువైన మద్యం మిథున్‌రెడ్డి కనుసన్నల్లోనే పంపిణీ జరిగింది. ఈ మందు పలుచోట్ల జిల్లాల్లో పట్టుబడింది. ఈ బాటిళ్లు అత్యంత నాసిరకంగా తేల్చారు.

సెజ్‌లు..పోర్టు..

పదివేల ఎకరాల విస్తీర్ణంలో ఉన్న కాకినాడ సెజ్ దేశంలోనే పెద్దది. ఇందులో 51 శాతం జీఎమ్మార్, కాకినాడ డీప్ వాటర్‌పోర్టు నిర్వహణదారుడైన కేవీరావుకు 0.29 శాతం, ఆయనకే చెందిన కాకినాడ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ హోల్డింగ్స్ ప్రైవేట్ లిమిటెడ్(కేఐహెచ్‌పీఎల్)కు 33.75 శాతం వాటాలున్నాయి. వీటన్నింటిపై జగన్ కన్నేయగా, మిథున్‌రెడ్డి రంగంలోకి దిగి వైవీ.విక్రాంత్‌రెడ్డితో కలిపి స్కెచ్ వేశారు. కేవీ రావును బెదిరించి వాటా రాయించేసుకున్నారు. కాకినాడ సీపోర్టు (డీప్‌వాటర్‌పోర్టు)పైనా జగన్ కన్నేయడంతో మిథున్‌రెడ్డి బెదిరించి 41.12శాతం వాటాను కేవీ రావు జగన్ చెప్పిన అరబిందోకు విక్రయించారు.



బిక్కవోలు పీజీఆర్ఎస్‌లో సమస్యలు వింటున్న కలెక్టర్ ప్రశాంతి

సమస్యల పరిష్కారానికే పీజీఆర్ఎస్

బిక్కవోలులో కలెక్టర్ ప్రశాంతి

బిక్కవోలు, జూలై 21(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రజా సమస్యల సత్వర పరిష్కారానికి పీజీఆర్ఎస్ ఎంతగానో దోహదపడుతుందని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. బిక్కవోలు మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన పీజీఆర్ఎస్‌కు కలెక్టర్ హాజరయ్యారు. ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. సావధానంగా సమస్యలు విన్నారు. 21 మంది తమ సమస్యలు పరిష్కరించాలంటూ వినతిపత్రాలు కలెక్టర్‌కు అందజేశారు. వీటిలో 4 ఇతర మండలాల నుంచి, 5 రెవెన్యూ, మిగిలిన 13 ఇతర సమస్యలకు సంబంధించినవి ఉన్నాయి. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ మండల పరిధిలో ప్రజల్లో చైతన్యం కలిగించేందుకే పీజీఆర్ఎస్‌కు వచ్చానన్నారు. ప్రజలు మరింత సమర్థవంతమైన పౌరసేవలకు 95523 00009 వాట్సప్ గవర్నెన్స్, పీజీఆర్ఎస్ పరిష్కార స్థాయి కోసం 1100 నెంబర్లకు డయల్ చేయాలన్నారు. అనంతరం భూముల రీసర్వేలో చాలా అవకతవకలు జరిగాయని వాటిని సరిచేయాలంటూ కూటమి నేతలు కలెక్టర్‌ను కోరారు. రీసర్వేలో తక్కువ భూములు వచ్చిన వారు ఎన్నిసార్లు తహశీల్దార్ కార్యాలయం చుట్టూ తిరిగినా సరిచేయడం లేదని, ఎక్కువ భూమి వచ్చిన వారు సంతకం చేస్తే సరిచేస్తామనడం ఎంత వరకూ సమంజమని ప్రశ్నించారు. ఆన్‌లైన్‌లో అయినా సరిచేయాలన్నారు. దీంతో కలెక్టర్ రికార్డులు చూసి సరిచేయాలని తహశీల్దార్ కృష్ణకు సూచించారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉండగా గత తహశీల్దార్ దొంగచాటుగా 220 ఇళ్ల పట్టాలు ఇచ్చారని వాటిని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. దీనిపై నివేదిక పంపాలని తహశీల్దార్‌కు సూచించారు. ఆమె వెంట జేసీ ఎస్.చిన్నరాముడు, డీఆర్‌డీఏ పీడీ ఎన్‌వీవీఎస్. మూర్తి, డీపీవో వి. శాంతామణి, డీఎంహెచ్‌వో డా. కె. వెంకటేశ్వరరావు, డీసీహెచ్ఎస్ పద్మ, ఎంపీపీ తేతలి సుమ, సర్పంచ్ సరెళ్ల సుమలత, ఎంపీడీవో వి. శ్రీనివాస్, కూటమి నేతలు కొవ్వూరి వేణుగోపాలరెడ్డి,పాలచర్ల శివప్రసాద్‌చౌదరి, చింతా శ్రీనివాసరెడ్డి, నల్లమిల్లి సుబ్బారెడ్డి, గొర్రెల త్రిమూర్తులు తదితరులు పాల్గొన్నారు.

పీజీఆర్ఎస్‌కు 234 అర్జీలు

రాజమహేంద్రవరం రూరల్, జూలై 21 (ఆంధ్రజ్యోతి): ప్రజల సమస్యల పరిష్కారం కోసం ప్రతి సోమవారం నిర్వహించే పీజీఆర్ఎస్‌లో భాగంగా జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన మీకోసంలో 234 అర్జీలు ప్రజల నుంచి వచ్చాయని డీఆర్‌వో టి.సీతారామ్మూర్తి తెలిపారు. కలెక్టరేట్‌లో సోమవారం ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు.పౌరసేవలపై అధికారుల జవాబుదారీతనం కలిగి ఉండాలన్నారు. పీజీఆర్ఎస్‌లో రెవెన్యూ శాఖ 101 అర్జీలు, పంచాయితీరాజ్ 39, పోలీస్ 22, విద్యుత్ శాఖ 12, ఇతర శాఖలు 58 అర్జీలు స్వీకరించినట్లు డీఆర్‌వో తెలిపారు.కార్యక్రమంలో స్పెషల్ కలెక్టర్లు ప్రేమ్ కుమార్, భాగ్యలక్ష్మి, సీపీవో ఎల్ అప్పలకొండ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

డీపీవోలో గ్రీవెన్స్‌కి 27 అర్జీలు

రాజమహేంద్రవరం, జూలై 21 (ఆంధ్రజ్యోతి): జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం పబ్లిక్ గ్రీవెన్స్ నిర్వహించారు. అడిషనల్ ఎస్పీలు ఎన్‌బీఎం మురళీకృష్ణ, ఏవీ సుబ్బరాజు ప్రజల నుంచి 27 ఫిర్యాదులను స్వీకరించారు. తదుపరి చర్యల నిమిత్తం సంబంధిత అధికారులకు పంపించారు.



భీమోలులో అసైన్డ్ భూములు పరిశీలిస్తున్న స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఎస్.భాస్కర్‌రెడ్డి

సర్వే నెంబర్లు మార్చి ఆన్‌లైన్ చేస్తే చర్యలు

స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ భాస్కర్‌రెడ్డి

గోపాలపురం, జూలై 21 (ఆంధ్రజ్యోతి): వివాదాస్పద భూములకు సర్వే నెంబర్లు మార్చి ఆన్‌లైన్ చేస్తే చర్యలు తప్పవని స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఎస్.భాస్కర్‌రెడ్డి హెచ్చరించారు. సర్వే నెంబర్ మార్చి తనకు భూమి ఆన్‌లైన్ చేశారని నరసింహారెడ్డి ఇటీవల కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన కలెక్టర్ పి.ప్రశాంతి క్షేత్రస్థాయి విచారణ చేట్టాలని ఆదేశించారు. ఈ మేరకు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ భాస్కర్‌రెడ్డి విచారణ చేపట్టి మాట్లాడారు.సర్వే నెంబర్ 558/1ఏలో భీమోలుకు చెందిన కొంత మంది వ్యక్తులకు భూమివ్వడం జరిగిందన్నారు. అదే సర్వే నెంబర్ పేరుతో వేరే ప్రదేశంలో వివాదంలో ఉన్న భూమిని నరసింహారెడ్డి పేరున ఆన్‌లైన్ చేశారని కలెక్టర్‌కు ఫిర్యాదు అందిందన్నారు. దీనిపై క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టగా విచారణలో అవకతవకలు జరిగినట్టు నిర్ధారణ అయ్యిందన్నారు. రెండు చోట్ల ఉన్నభూములను రెవెన్యూ అధికారులతో కలిసి స్వయంగా పరిశీలించామన్నారు. దీనిపై సమగ్ర నివేదిక తయారు చేసి తనకు అందజేయాలని తహశీల్దార్ అజయ్ బాబుకు ఆదేశించారు.అనంతరం నివేదికను కలెక్టర్‌కు సమర్పిస్తామన్నారు.ఆయన వెంట ఆర్ఐ సునీత, సర్వేయర్ సత్యానా రాయణ, వీఆర్వో గోతియ్య, విలేజ్ సర్వేయర్ ఇమ్రాన్, ఫిర్యా దుదారుడు నరసింహారెడ్డి ఉన్నారు.

వైద్యో..నారాయణో హరి..హరీ!

పెద్దాసుపత్రికి వస్తే చింతే

రాజమహేంద్రవరం ప్రభుత్వాస్పత్రిలోని అత్యవసర చికిత్స విభాగానికి అత్యవసర చికిత్స తక్షణ అవసరంగా కనిపిస్తోంది. గుప్పెట్లో ప్రాణాలు పెట్టుకొని వస్తున్న బాధితులకు నిర్లక్ష్యం ఆహ్వానం పలుకుతోంది. గోల్డెన్ మినిట్స్‌ని వృథా చేస్తూ యథాలాపంగా విధులు నిర్వహిస్తుండడం బాధితులకు కన్నీటిని మిగులుస్తోంది. జిల్లా ఆస్పత్రి కావడంతో అత్యవసరంగా ఒక వ్యక్తిని ఆస్పత్రి వరకూ తీసుకొచ్చినా చికిత్స లోపలకు తీసుకెళ్లే వారు కానరావడంలేదు. స్ట్రెచర్, వీల్ ఛైర్ కోసం వెతుకులాట తప్పదు. దీంతో క్షతగాత్రులు రక్తం కారుతూ, బాధను ఓర్చుకుంటూ ఆటోలో, అంబులెన్సులో అప్పటి వరకూ ఉండాల్సిందే. స్ట్రెచర్‌ని బాధితులు వెతికి తెచ్చుకొని దానిపై క్షతగాత్రుని ఎక్కించడానికి నానా యాతన పడుతున్నారు. తీరా లోపలకు తీసుకెళ్లిన తర్వాత కూడా సిబ్బందిలో తాపత్రయం కనబడడం లేదు. కసురుకోవడం, విసుక్కోవడం ఎక్కువైపోయింది. ఒకవేళ ప్రాణం గుటుక్కుమంటే సీఎంవో గది బయటే స్ట్రెచర్‌పై గంటల తరబడి ఆ మృతదేహాన్ని వదిలేస్తున్నారు. ఇటువంటి ఘటనలు జిల్లా ఆసుపత్రిలో నిత్యకృత్యంగా మారాయి. వాస్తవానికి 2022 డిసెంబరు 21న డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ అండ్ కమిషనర్ ఆఫ్ ఏపీవీవీపీ ఆదేశాల ప్రకారం అత్యవసర చికిత్స కోసం వచ్చే వారిని క్యాజువాలిటీకి తీసుకెళ్లడానికి ద్వారం వద్ద 2 స్ట్రెచర్లు, 2 వీల్ ఛైర్లు, ఒక్కొక్కరు చొప్పున ఎంఎన్‌వో, ఎఫ్ఎన్‌వో, వైద్యుడును (సీఎఎస్-జనరల్/జీడీఎంవో/హౌస్ సర్జన్‌లకు ప్రాధాన్యం ఇవ్వాలి) నిరంతరం అందుబాటులో ఉంచాలి.కానీ ఇక్కడ స్ట్రెచర్ కూడా కానరాదు.







ఈ ఫొటోలు చూస్తే ప్రభుత్వాస్పత్రిలోని అత్యవసర విభాగం అలసత్వం అర్థమవుతుంది. ఓ దివ్యాంగురాలు ఆస్పత్రి వరకూ ఆటోలో వచ్చి అక్కడి నుంచి లోపలికి వెళ్లే వీల్ చైర్ లేక గంటల తరబడి అలాగే ఉండిపోయింది. మరొక మహిళను ఆస్పత్రికి అత్యవసర చికిత్సకు తీసుకొచ్చి స్ట్రెచర్‌పై ఇబ్బందులు పడుతూ తీసుకెళ్లారు. ఈ దుస్థితి ఇక్కడ నిత్యకృత్యంగా మారిపోయింది. అర్ధరాత్రి వేళలో వస్తే వైద్యో నారాయణో హరి..హరీయే!

(రాజమహేంద్రవరం - ఆంధ్రజ్యోతి)

టీచర్ల కేడర్ స్ట్రెంగ్త్ సమస్య పరిష్కరించాలి

యూటీఎఫ్ నాయకుల డిమాండ్

రాజమహేంద్రవరం అర్బన్, జూలై 21 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలోని ఉపాధ్యాయుల కేడర్ స్ట్రెంగ్త్ సమస్యను ఉన్నతాధికారులు వెంటనే పరిష్కరించి, బదిలీ అయిన ఉపాధ్యాయులకు రెండు నెలల జీతాలు చెల్లించాలని యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పి.జయకర్, ఏ. షరీఫ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం రాజమహేంద్రవరంలోని జిల్లా కార్యాలయంలో జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో వారు మాట్లాడారు. టీచర్ల బదిలీలు జరిగి ఇప్పటికి రెండు నెలలు పూర్తవుతున్నా బదిలీ అయిన ఉపాధ్యాయుల కేడర్ స్ట్రెంగ్త్ సమస్య పరిష్కారం కాలేదన్నారు. రాష్ట్ర కార్యదర్శి ఎన్.అరుణకుమారి మాట్లాడుతూ గత పీఆర్‌సీ బకాయిలతో పాటు ఉద్యోగులకు పెండింగ్‌లో ఉన్న నాలుగు డీఏలు, 2021 నుంచి బకాయిన్న ఏపీజీఎల్ఐ బకాయిలు చెల్లించాలని కోరారు.ఈ కార్యక్రమంలో జిల్లా కోశాధికారి ఈవీఎస్ఆర్ ప్రసాద్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రూపస్, జిల్లా కార్యదర్శులు రమేష్‌బాబు, పి.శ్రీనివాసమూర్తి, కే.నాగభూషణం, చిలుకూరి శ్రీనివాస్, కేవీఎస్‌ప్రకాష్‌రావు పాల్గొన్నారు.

ఏం చెప్పమంటారు.. బాస్!

- ఎస్పీ సీరియస్‌తో గుబులు
- హైవే పెట్రోలింగ్‌లో హైరానా
- ఇప్పటి వరకూ 3 కేసులు.. 6 కాసులు
- ఎటూ చెప్పలేక అయోమయం

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

బాస్‌లు ఏం చెబితే అది చేయాలి.. కాదంటే కుదురుతుందా.. చేయమంటే తప్పుతుందా.. ప్రస్తుతం ఒక వర్గం పోలీసుల పరిస్థితి అడకత్తెరలో పోకచెక్కలా ఉంది. ఎందుకంటే బాస్‌లు ముడుపులు పుచ్చుకొని విధుల్లో కళ్లు మూసుకుంటుంటే.. ఉన్నత బాసులు తమను నిందిస్తుండంపై జిల్లా పోలీసుల్లోని ఓ విభాగం వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లా పోలీసు శాఖలో హైవే పెట్రోలింగ్ విభాగం ఉంది.జిల్లాలోని గోపాలపురం, కొవ్వూరు రూరల్, దేవరపల్లి, త్రీ టౌన్, ప్రకాశంనగర్, రాజానగరం, బొమ్మూరు స్టేషన్లకు హైవే పరిధి ఉంది. వీటిలో బొమ్మూరు, రాజానగరం, దేవరపల్లి స్టేషన్లు కీలకం. హైవేలోని ప్రమాదాలు ఎక్కువగా జరుగుతుండడంతో..వాటి నివారణకు ముందస్తు భద్రత చర్యల్లో భాగంగా హైవే మొబైల్ టీంలను ఏర్పాటు చేశారు. జిల్లాలో మూడు హైవే మొబైల్, మూడు రోడ్ సేఫ్టీ మొబైల్ టీంలు ఉన్నాయి. ప్రతి టీంకి ఒక జీపు, ప్రమాద సమయంలో కావాల్సిన సరంజామా, ఒక హెడ్ కానిస్టే బుల్/ఎఎస్ఐ, ఒక డ్రైవరు ఉంటారు.ఈ టీంలు నిరంతరాయంగా హైవేలో తిరుగుతూ గమనిస్తుండాలి. హైవేలపై నిబంధనలకు విరుద్ధంగా నిలిపిన లారీలు, వ్యాన్లను తీయించడం, ప్రమాదాలు జరిగిన సమయంలో క్షతగాత్రులను వెంటనే ఆస్పత్రులకు తరలించడం తదితర విధులు నిర్వర్తిస్తారు. రాత్రి వేళల్లో హైవేకు దగ్గరగా ఉన్న దాబాలు,హోటళ్లు, మద్యం దుకాణాలను మూత వేయించడం కూడా రోజూ చేయాలి.రాత్రి వేళల్లో ఆవుల రవాణా తదితర అక్రమ దందా వాహనాల ద్వారా బాగానే ముడుతుందనేది బహిరంగ రహస్యం.దీంతో హైవే పెట్రోలింగ్ వాహనాల్లో డ్యూటీ కోసం కొందరు కాచుకొని కూర్చుంటారు. ఇలా హైవే పెట్రోలింగ్ అసలు పనిని కాలానికి వదిలేసి..మూడు లారీలు, ఆరు కాసులు అనే చందంగా సాగిపోతోంది.అయితే ఇటీవల జాతీయ రహదారిపై ఎక్కడ పడితే అక్కడ భారీ లారీలు సైతం నిలిపివేస్తుండడం,దాబాలు,హోటళ్లు తెల్లార్లూ తెరిచేఉండ డాన్ని జిల్లా బాస్ గుర్తించి కన్నెర్ర చేశారు. ఏంటీ అలసత్వం అంటూ గట్టిగా ప్రశ్నించారు. మొబైల్ టీంలలో తడుములాట మొదలైంది.హైవేపై దాబాలు, హో టళ్ల వాళ్లు ఆయా స్టేషన్లకు నెలవారీ మొక్కులు చెల్లిం చుకుంటూ ఉంటారు.దీంతో సమయం మించినా, ఏదైనా చిన్నపాటి గొడవలు జరిగినా చూసీ చూడకుండా వదిలే స్తుంటారు. దాబాల్లో అనధికార బార్లు నడుస్తున్నాయని సమాచారం. తమ పైవారు మొత్తాలు పుచ్చుకోవడంతో తమ మాట వినడం లేదని, దుకాణం వద్దకు సైరన్‌తో జీపు వెళ్లినా, తాము హెచ్చరించినా లెక్క చేయడం లేదని జిల్లా బాస్‌కు ఎలా చెప్పాలని ఎదురు ప్రశ్నవేస్తున్నారు.కొందరు అక్కడి నుంచే తమ సీఐలతో మాట్లాడుతుంటారని,అప్పుడు తాము జారుకోవడం తప్ప చేసేదేమీ ఉండడం లేదని వాపోతున్నారు.





డిగ్రీ కోర్సుల్లో ప్రవేశాల కోసం ఎదురుచూపులు తప్పట్లేదు. తీవ్ర తర్జనభర్జనల అనంతరం డిగ్రీ కళాశాల్లో అడ్మిషన్లకు రాష్ట్ర ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఇందుకు సంబంధించి పలు నిబంధనలను సవరిస్తూ జీవో జారీ చేసింది. ఆన్‌లైన్‌తో పాటు ఆఫ్‌లైన్ లోనూ ప్రవేశం కోసం దరఖాస్తు చేసే అవకాశాన్ని కల్పించింది. కానీ ఇప్పటి వరకు అడ్మిషన్ల ప్రక్రియలో కీలకమైన ఓఏఎండీసీ వెబ్‌సైట్ (పోర్టల్) అప్డేట్ కాకపోగా, వెబ్ ఆప్షన్లు కూడా ఓపెన్ కాలేదు. ప్రభుత్వం జీవో ఇచ్చి ఆరు రోజులు దాటినా ఇంతవరకు ఏపీ ఉన్నత విద్యా మండలి నుంచి మార్గదర్శకాలు, ప్రవేశాల షెడ్యూల్ రాకపోవడంపై విద్యా శాఖ వర్గాల్లోనే అసహనం వ్యక్తమవుతోంది.

గ్రీన్ సిగ్నల్

- డిగ్రీ అడ్మిషన్లకు ప్రభుత్వం అనుమతి
- ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో దరఖాస్తులు సమర్పించే అవకాశం
- విద్యార్థుల ఆధార్ ఆథంటికేషన్ తప్పనిసరి
- అప్డేట్ కాని ఓఏఎండీసీ పోర్టల్
- ఓపెన్ కాని వెబ్ ఆప్షన్లు
- ప్రవేశాల షెడ్యూల్ కోసం విద్యార్థుల ఎదురుచూపులు
- ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసి ఆరు రోజులు
- ఉన్నత విద్యా మండలి నుంచి విడుదల కాని మార్గదర్శకాలు


(పిఠాపురం-ఆంధ్రజ్యోతి)

డిగ్రీ కళాశాలల్లో ప్రవేశాలపై ఉన్న సందిగ్ధత ఎట్టకేలకు తొలగింది. ఇంటర్మీడియట్ ఫలితాలు వచ్చిన మూడు నెలల అనంతరం ప్రవేశాలకు అనుమతి ఇస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రవేశాలను ఆన్‌లైన్‌లో లేదా ఆఫ్ లైన్‌లో నిర్వహించాలనే విషయంలో తర్జనభర్జనల అనంతరం రెండు పద్ధతుల్లోనూ దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం కల్పించింది. ఎస్సీ వర్గీకరణ అనంతరం జరుగుతున్న ప్రవేశాలు కావడంతో వాటిపైనా క్లారిటీ ఇచ్చారు. ప్రభుత్వం జీవో జారీ చేసి ఆరు రోజులు దాటినా ఇప్పటిదాకా ఏపీ స్టేట్ కౌన్సిల్ ఆఫ్ హైయ్యర్ ఎడ్యుకేషన్ నుంచి మార్గదర్శకాలు, అడ్మిషన్ల షెడ్యూలు విడుదల కాకపోవడంతో విద్యార్థులకు ఎదురుచూపులు తప్పడం లేదు. దరఖాస్తులు ఆన్‌లైన్ చేసే ఓఏఎండీసీ వెబ్‌సైట్ ఇంకా అప్డేట్ కాలేదు. ఇంకా 2024-25 అడ్మిషన్లకు సంబంధించిన షెడ్యూల్‌నే చూపిస్తోంది.

అన్ని వర్గాలతో చర్చించి...

కాకినాడ జిల్లాలో కాకినాడ నగరంతో పాటు పిఠాపురం, తుని, ఏలేశ్వరం, జగ్గంపేట, పెరుమాళ్లపురం, పెద్దాపురంల్లో ప్రభుత్వ, ఎయిడెడ్ కళాశాలలు ఉన్నాయి. వీటికి దాదాపు మూడు రెట్లు అదనంగా ప్రైవేటు కాలేజీలు ఉన్నాయి. వీటిల్లో 20వేలకు పైగా సీట్లు ఉన్నాయి. తూర్పు గోదావరి, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాల్లోనూ ఇదే స్థాయిలో కళాశాలలు ఉన్నాయి. వైసీపీ తీసుకువచ్చిన అడ్మిషన్ల ప్రక్రియ గందరగోళంగా ఉండడంతో దీనిలో మార్పు చేయాలని కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే నిర్ణయం తీసుకుంది. దీనిపై ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలల ప్రతినిధులు, వివిధ సంఘాల నాయకులు, విద్యావేత్తలతో చర్చించింది. ఆన్‌లైన్ ప్రక్రియను కొనసాగిస్తూనే పాత పద్ధతిలో కళాశాలల్లో ఆఫ్‌లైన్‌లో దరఖాస్తులు సమర్పించే విధానం అమలు చేయాలని ఎక్కువ మంది సూచించారు. దీంతో దీనిని ఖరారు చేస్తూ రాష్ట్ర ఉన్నత విద్యా శాఖ కార్యదర్శి కోన శశిధర్ జీవో నెం.45 జారీ చేశారు.

అదే విధంగా డిగ్రీలో ప్రస్తుతం ఉన్న సింగిల్ సబ్జెక్టు విధానంలో స్వల్ప మార్పులతో పాత విధానాన్నే కొనసాగించాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఆర్ట్స్, సైన్స్, సోషల్ సైన్స్, కామర్స్, మేనేజ్‌మెంట్, కంప్యూటర్ అప్లికేషన్స్, సోషల్ వర్క్ తదితర కోర్సుల్లో డిగ్రీలు, హానర్స్ డిగ్రీలో ప్రవేశాలకు ఆంధ్రప్రదేశ్ డిగ్రీ కాలేజెస్ ఆన్‌లైన్ అడ్మిషన్ రూల్స్-2020లో సవరణలు చేస్తూ ఉత్తర్వులిచ్చారు. దీని ప్రకారం ఆయా కోర్సుల్లో డిగ్రీ చేసేందుకు (బీఏ, బీకాం, బీఎస్సీ) ఇంటర్ పూర్తి చేసిన విద్యార్థులు ఓఏఎండీసీ పోర్టల్ ద్వారా తమ దరఖాస్తులను సమర్పించాల్సి ఉంటుంది. ఇందులోనే తమకు నచ్చిన కళాశాల, కోర్సును ఆర్డర్ ఆఫ్ ప్రిఫరెన్స్‌లో ఎంచుకునే అవకాశం కల్పించారు. లేకుంటే తమకు అందుబాటులో ఉండే (లేదా) నచ్చిన కళాశాలలో విద్యార్థులు నేరుగా దరఖాస్తు చేసుకోవచ్చు. దరఖాస్తులను ఆయా డిగ్రీ కళాశాలల ప్రిన్సిపాళ్లు తీసుకుని విద్యార్థులకు రసీదు ఇవ్వడంతో పాటు ఓఏఎండీసీ పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలి. రెండు విధానాల్లోనూ దరఖాస్తుకు ఆధార్ ఆథంటికేషన్ తప్పనిసరి చేశారు. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో విద్యార్థి దరఖాస్తు చేసుకుంటే స్వయంగా కళాశాలలో ఇచ్చిన అప్లికేషన్‌లోని ఆప్షన్లనే పరిగణలోకి తీసుకుంటారు.



ఓఏఎండీసీ పోర్టల్‌లో ఇంకా 2024-25 అడ్మిషన్ల ప్రక్రియనే చూపిస్తున్న దృశ్యం

ఉత్తర్వులిచ్చి ఆరు రోజులైనా...

డిగ్రీ ప్రవేశాలకు రాష్ట్ర ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చి ఐదు రోజులు దాటింది. ఇప్పటి వరకు ఏపీ ఉన్నత విద్యా మండలి నుంచి ప్రవేశాల షెడ్యూల్, మార్గదర్శకాలు మాత్రం విడుదల కాలేదు. కనీసం దరఖాస్తులు ఆన్‌లైన్‌లో సమర్పించే ఓఏఎండీసీ పోర్టల్‌ను ఇప్పటిదాకా అప్డేట్ చేయలేదు. అందులో ఇంకా 2024-25 అడ్మిషన్ల ప్రక్రియ, అప్పటి నోటిఫికేషన్లనే చూపిస్తోంది. ప్రతిరోజూ ఈ పోర్టల్‌ను తనిఖీ చేసుకుంటున్న విద్యార్థులకు నిరాశే మిగులుతోంది.

త్వరితగతిన పూర్తి చేయాలి

ఇంటర్ పరీక్షా ఫలితాలు వచ్చి మూడు నెలలు దాటినందున డిగ్రీ అడ్మిషన్ల ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయడంపై ప్రభుత్వం దృష్టి సారించాలని విద్యావేత్తలు కోరుతున్నారు. మూడు, నాలుగు వారాలు లోపుగానే దరఖాస్తులు, వెబ్ ఆప్షన్ల స్వీకరణ, అలాట్‌మెంట్ పూర్తయితే విద్యా సంవత్సరాన్ని త్వరగా ప్రారంభించే వీలుంటుందని వారు చెప్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం జీవో ఇచ్చినా మార్గదర్శకాలు, అడ్మిషన్ షెడ్యూల్ ఇవ్వడానికి ఏపీ ఉన్నత విద్యా మండలి ఇంత సమయం తీసుకోవడం సరికాదంటున్నారు. కాగా రెండు, మూడు రోజుల్లో ప్రవేశాల షెడ్యూల్ ఇవ్వడంతో పాటు వెబ్ ఆప్షన్లు ఓపెన్ అవుతాయని భావిస్తున్నామని ఉన్నత విద్యా శాఖకు చెందిన ఉన్నతాధికారి ఒకరు చెప్పారు.

ఐదేళ్లలో ఎన్ని చమురు నిల్వలు కనుగొన్నారు?

పెట్రోలియం, సహజవాయువులపై పార్లమెంట్‌లో సతీష్‌బాబు ప్రశ్నలు


బీజేపీ రాష్ట్రాధ్యక్షుడు మాధవ్‌తో సతీష్‌బాబు

కాకినాడ సిటీ, జూలై 21 (ఆంధ్రజ్యోతి): పెట్రోలియం, సహజవాయువులపై సోమవారం జరిగిన పార్లమెంట్ సమావేశంలో రాజ్యసభ సభ్యుడు సానా సతీష్‌బాబు పలు ప్రశ్నలు వేశారు. గత ఐదేళ్లలో కనుగొన్న చమురు, గ్యాస్ నిల్వలపై ప్రభుత్వం ఏమైనా అధ్యయనాలు, పరిశోధనలు చేసిందా, అలాగే గత ఐదేళ్లలో రాష్ట్రాలవారీగా ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్‌లో చేపట్టిన అన్వేషణ ప్రాజెక్టులు వివరాలు తెలపాలని కోరారు. ప్రాంతాలవారీగా కనుగొన్న నిల్వల పరిమాణం, వాటి వినియోగానికి తీసుకున్న చర్యలు వెల్లడించాలన్నారు. ఈ ప్రాజెక్టులకు వినియోగించిన మొత్తం నిధులు, బేసిన్ ఎంపిక, వాణిజ్య సాధ్యత మూల్యాంకనం, పర్యావరణ అంచనాలపై అనుసరించే ప్రమాణాలు తెలియజేయాలన్నారు. అలాగే మిషన్ అన్వేషణ్ స్థితి, పెట్టుబడులు ఆకర్షించడానికి సాంకేతిక బదిలీని ప్రోత్సహించడానికి, వ్యూహాత్మక పెట్రోలియం నిల్వలను విస్తరించడానికి తీసుకున్న చర్యలు ఏమిటో తెలపాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. అలాగే ఐదేళ్లలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో డిస్ట్రిక్ట్ మినరల్ ఫౌండేషన్ కింద సేకరించిన మొత్తం నిధులు, కాకినాడతో పాటుగా జిల్లాల వారీగా తెలపాలన్నారు. ఈ ప్రశ్నలకు కేంద్ర పెట్రోలియం, సహజవాయువుల శాఖ మంత్రి సురేష్ గోపి సమాధానమిచ్చారు. ఆంధ్రప్రదేశ్‌తో సహా దేశంలో చమురు, గ్యాస్ నిల్వలను అంచనా వేయడానికి వివిధ సర్వేలు జరుగుతున్నాయన్నారు. వివిధ పాలసీల కింద కేంద్ర ప్రభుత్వం మొత్తం 112 బ్లాక్‌లను మంజూరు చేసిందన్నారు. ఈ బ్లాక్‌లను పొందిన ఆపరేటర్లు గత ఐదేళ్లలో 101 అన్వేషన బావులను తవ్వారని స్పష్టం చేశారు. ఈ కార్యకలాపాల నిర్వహణ కోసం రూ.4,448 కోట్లు ఖర్చు చేశారని తెలిపారు. అలాగే కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డి మాట్లాడుతూ కాకినాడ జిల్లాలో మినరల్, రెవెన్యూ జనరేషన్‌లో లేటరైట్స్‌కి రూ.36.86 కోట్లు ఆదాయం వచ్చినట్టు పేర్కొన్నారు. ఈ వివరాలను ఎంపీ సతీష్‌బాబు క్యాంపు కార్యాలయం నుంచి విడుదల చేసిన ప్రకటనలో వెల్లడించారు.

బీజేపీ రాష్ట్రాధ్యక్షుడిని కలిసిన సానా

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీ మాధవ్‌ను సోమవారం ఢిల్లీలోని పార్లమెంట్ భవన్‌లో రాజ్యసభ సభ్యుడు సానా సతీష్‌బాబు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వీరిద్దరూ కొద్దిసేను భేటీ అయ్యారు.


స్వల్పంగా పెరుగుతున్న నీటి మట్టం

స్వల్పంగా పెరిగిన వరద

ధవళేశ్వరం, జూలై 21(ఆంధ్రజ్యోతి): అల్పపీడన ప్రభావంతో కురుస్తున్న వర్షాలు వల్ల వాగులు, వంకలు పొంగి ప్రవహిస్తూ గోదావరిలో కలుస్తుండడంతో ధవళేశ్వరం వద్ద గోదావరికి వరద స్వల్పంగా పెరిగింది. కాటన్ బ్యారేజ్ నుంచి 64,663 క్యూసెక్కులు సముద్రంలోకి విడుదల చేస్తున్నారు. డెల్టా పరిధిలో కురుస్తున్న వర్షాలు వల్ల కాలువలకు సాగునీటి విడుదల తగ్గించారు. తూర్పుడెల్టాకు 3800క్యూసెక్కులు, మధ్యడెల్టాకు 2300క్యూసెక్కులు, పశ్చిమ డెల్టాకు 4700క్యూసెక్కులు చొప్పున సాగునీటిని విడుదల చేస్తున్నారు. భద్రాచలం వద్ద నీటి మట్టం స్వల్పంగా పెరిగి 13.70 అడుగులుగా నమోదయింది.

ద్రాక్షారామలో ముగిసిన సప్తసప్తాహం


పూర్ణాహుతి కార్యక్రమం నిర్వహిస్తున్న పండితులు

ద్రాక్షారామ, జూలై 21(ఆంధ్రజ్యోతి): బీఆర్ అంబేడ్కర్ జిల్లా ద్రాక్షారామ భీమేశ్వరాలయ బాహ్యప్రాంగణంలో వేంచేసియున్న ప్రసన్నాంజనేయ స్వామి సన్నిధిలో జూన్ 2 నుంచి నిర్వహిస్తున్న సప్తసప్తాహం సోమవారం ముగిసింది. ఈ సందర్భంగా పూర్ణాహుతి కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. సీతారాముల శాంతి కల్యాణం, సామ్రాజ్య పట్టాభిషేకం జరిపారు. అనంతరం అన్నసమారాధన జరిగింది. సాయంత్రం ఉష్ట్ర వాహనంపై స్వామివారి నగరోత్సవం వైభవంగా నిర్వహించారు. ఒంటె ప్రదర్శన, కోలాట నృత్యాలు, బ్యాండు వాయిద్యాలు, చింతూరు గిరిజన ఆదివాసీ నృత్యప్రదర్శన, కేరళ వాయిద్యాలతో నగరోత్సవం జరిగింది. రాత్రి త్రిరత్నాల పేరిట రంగస్థల నాటికలు ప్రదర్శించారు. పూర్ణాహుతి కార్యక్రమంలో ప్రసన్నాంజనేయ బాలభక్త సమాజం అధ్యక్షుడు బోనం శ్రీనివాస్ దంపతులు పాల్గొన్నారు. కార్యక్రమంలో బాలభక్త సమాజం సభ్యులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

యోగాసన పోటీల్లో యూసీఈకే విద్యార్థుల ప్రతిభ


విజేతలను అభినందిస్తున్న జేఎన్టీయూకే వీసీ సీఎస్ఆర్కే ప్రసాద్

జేఎన్టీయూకే, జూలై 21 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జేఎన్టీయూలో నిర్వహించిన జిల్లా స్థాయి యోగాసన పోటీల్లో యూసీఈకే విద్యార్థులు ప్రతిభ కనబరిచి ఆగస్టులో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్టు పీఆర్వో ఆర్.శ్రీనివాసరావు సోమవారం తెలిపారు. పెట్రోలియం ఇంజనీరింగ్ విద్యార్థి కె.అభిరామ్ ఆర్టిస్టిక్ సోలో, ట్విస్టింగ్ బాడీ ఇండివిడ్యువల్ విభాగాల్లో ప్రథమ స్థానంలో నిలిచాడు. మెకానికల్ ఇంజనీరింగ్ విద్యార్థినులు గీతాసంజన, శైలజ ఆర్టిస్ట్ ఫెయిర్ విభాగంలో మొదటి స్థానం సాధించారు. విద్యార్థులను, వారికి శిక్షణనిచ్చిన డాక్టర్ చంద్రు సుధాదేవిని జేఎన్టీయూకే వీసీ సీఎస్ఆర్కే ప్రసాద్ అభినందించారు.

వందే భారత్‌కు సామర్లకోటలో హాల్ట్ పొడిగింపు



సామర్లకోట, జూలై 21(ఆంధ్రజ్యోతి): సామర్లకోట మీదుగా అటు విశాఖ ఇటు సికింద్రాబాద్‌లకు రాకపోకలు సాగిస్తున్న వందేభారత్ సూపర్ ఫాస్ట్‌ఎక్స్‌ప్రెస్‌కు సామర్లకోటలో హాల్ట్‌ను మరో ఆరు నెలలు పెంచుతూ రైల్వే సీనియర్ డీవీఎం కార్యాలయం నుంచి సోమవారం రాత్రి ఉత్తర్వులు సామర్లకోట రైల్వే అధికారులకు అందాయి. గతంలో జారీ చేసిన హాల్ట్ ఉత్తర్వులను మరో ఆరునెలలు పొడిగించారు. ఈ ఉత్తర్వులు ఆగస్టు 2 నుంచి అమలులోకి రానుంది.

- 20833 నెంబరు గల విశాఖ నుంచి సికింద్రాబాద్ వెళ్లే ఎక్స్‌ప్రెస్ సామర్లకోటకు ఉదయం 7.26 గంటలకు చేరుకుని రాజమహేంద్రవరం నకు 8.00 గంటలకు చేరుతుంది
- 20834 నెంబరు గల సికింద్రాబాద్ నుంచి విశాఖ వెళ్లే వందేభారత్ ఎక్స్‌ప్రెస్ రాజమహేంద్రవరంనకు రాత్రి 8.43 నిముషాలకు చేరుతుంది. సామర్లకోటకు రాత్రి 9.23 చేరుతుంది. ఈ రైలులో ప్రయాణించే ప్రయాణికులు తమ గమ్యస్థానాలకు రిజర్వేషన్ టిక్కెట్లు పొందగోరే వారు వందేభారత్ ఎక్స్‌ప్రెస్ రైలు హాల్ట్ ఉన్న స్టేషన్‌లలోని బుకింగ్ కార్యాలయాలలో సంప్రదించాలని రైల్వే సూపరింటెండెంట్ ఎం.రమేష్ సోమవారం రాత్రి తెలిపారు.

చెయ్యేరు సొసైటీ అధ్యక్షుడిగా శ్రీనివాస్ ప్రమాణస్వీకారం


కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే బుచ్చిబాబు

కాట్రేనికోన, జూలై 21(ఆంధ్రజ్యోతి): కాట్రేనికోన మండలం చెయ్యేరు సొసైటీ అధ్యక్షుడిగా త్సవటపల్లి శ్రీనివాస్‌తో పాటు డైరెక్టర్లుగా గుబ్బల రమేష్, పెయ్యల ముత్యాలరావు సోమవారం ప్రమాణ స్వీకారం చేశారు. ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ప్రమాణస్వీకారం చేసిన అనంతరం చైర్మన్ శ్రీనివాస్ మాట్లాడారు. సంఘ సభ్యులు, రైతుల మద్దతుతో చెయ్యేరు సొసైటీని అభివృద్ధి పథంలో నడిపించేందుకు కృషి చేస్తానన్నారు. తనపై నమ్మకం ఉంచి కీలక బాధ్యతలను అప్పగించిన ఎమ్మెల్యే సుబ్బరాజుకు ఆయన ధన్యవాదాలు తెలిపారు.ఎమ్మెల్యే మాట్లాడుతూ శ్రీనివాస్ నాయకత్వ పటిమ సంఘాభివృద్ధికి తోడ్పడుతుందన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖర్, నాగిడి నాగేశ్వరరావు, ఆకాశం శ్రీనివాస్, త్సవటపల్లి నాగేంద్ర, ఏఎంసీ చైర్మన్ ఓగూరి భాగ్యశ్రీ, మాజీ ఎమ్మెల్యే చెల్లి వివేకానంద, చెల్లి అశోక్, గుత్తుల సాయి, గంధం పళ్ళంరాజు, గొలకోటి వెంకటరెడ్డి, కల్వకొలను తాతాజీ, త్సవటపల్లి నాగభూషణం, సర్పంచ్ చెల్లి సురేష్, నంద్యాల వెంకటేశ్వరరావు, టీబీవీ నారాయణస్వామి, నంద్యాల చంటి, ఎంపీటీసీ గుత్తుల సూర్యమహాలక్ష్మి, నడింపల్లి సుబ్బరాజు, చింతపల్లి అజయ్‌కుమార్, సలాది నానాజీ, పాల్గొన్నారు.


పిఠాపురంలో శాకంబరిగా దర్శనమిచ్చిన పురుహూతికా అమ్మవారు

శరణు... శరణు...

శాకంబరీ

చల్లగా చూడు తల్లీ అంటూ

ఆషాఢంలో ప్రత్యేక అలంకరణలు

ఆషాఢంలో అమ్మవార్ల జాతరలు మొదలవుతాయి. ఈ మాసంలో అమ్మవార్ల ఆశీస్సులు తీసుకుంటారు. మొక్కులు చెల్లించుకుంటారు. ఏటా ఈ మాసం రాగానే పెద్ద ఎత్తున భక్తులు అమ్మవారి ఆలయాలను సందర్శిస్తారు. కాకినాడ జిల్లాలోని తలుపులమ్మ లోవ, మరిడమ్మ జాతరలతో పాటు పలు ప్రముఖ ఆలయాలు, చిన్న ఆలయాల్లో అమ్మవార్లకు ప్రత్యేక పూజలు, అలంకరణలు చేస్తారు. అమ్మవార్లు శాకం బరిగా దర్శనమిస్తారు. రకరకాల పండ్లు, కూరగాయలు, ఆకుకూరలతో అలంకరించి పూజిస్తారు. ఇలా చేయడం వల్ల సర్వసుఖాలు, విజయాలు, కోరికలు నెరవేరుతామయని భక్తుల నమ్మకం.


కాకినాడలో శాకంబరి అలంకరణలో బాలాత్రిపురసుందరి అమ్మవారు

(కాకినాడ/సామర్లకోట-ఆంధ్రజ్యోతి)

ఆషాఢ మాసంలో అమ్మవార్లను కూరగాయలతో అలంకరించే సంప్రదాయం శాకంబరీదేవి ఉత్సవాల్లో భాగం. శాకంబరి అంటే కూరగాయల తల్లి అని అర్థం. ఒకసారి కరువు వచ్చినప్పుడు ప్రజల బాధను చూసి చలించిన అమ్మవారు తనను తాను శాకంబరిగా మార్చుకుని అనేక రకాల కూరగాయలు, పండ్లు, ఆకుకూరలు సృష్టించి ప్రజలను కరువు నుంచి కాపాడినట్టు పురాణాలు చెప్తున్నాయి. అప్పట్నుంచీ అమ్మవారిని శాకంబరిగా పూజించే సంప్రదాయం మొదలైందని పండితులు చెప్తున్నారు. ఆషాఢంలో అమ్మవారిని కూరగాయలతో అలంకరించడం వల్ల, పంటలు బాగా పండి, ప్రజలకు ఆహార కొరత లేకుండా ఉంటుందని భక్తుల విశ్వాసం. ఈ మాసంలో మహిమాన్విత రూపంలో ఉండే అమ్మవారిని దర్శించుకోవడం వల్ల అన్ని కోర్కెలు నెరవేరుతాయని భక్తుల ప్రగాఢ నమ్మకం. అందుకే వివిధ రకాల కూరగాయలు, పండ్లు, ఆకుకూరలతో అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. ఈ అలంకరణలో అమ్మవారిని ఆహార పదార్థాలకు అధిదేవతగా ఆరాధిస్తారు. పౌర్ణమి వంటి దివ్య తిథుల్లో జరిగే ఉత్సవాలు, కైంకర్యాలు, పూజలతో పాటు ఆషాఢ మాసంలో అమ్మవారికి కూరగాయల అలంకరణను భక్తులే వారి చేతులతో స్వయంగా చేస్తారు.

ముందుగానే విగ్రహాల సైజులను బట్టి కూరగాయల దండలు తయారు చేస్తారు. ఆలయం మొత్తాన్ని కూరగాయలు, పండ్లు, ఆకు కూరలతో అలంకరించడం ఆనవాయితీగా మారింది. తోటకూర, గోంగూర, వేపాకు, కరివేపాకు, మామిడాకులు వంటి ఆకులతో పాటు, అమ్మవారి మెడలో ధగధగ మెరిసేలా కలర్‌ఫుల్ క్యారెట్, బీట్‌రూట్, బంగాళాదుంపలు, వంకాయలు, బెండకాయలు... ఇలా రకరకాల కూరగాయలతో పాటు ప్రస్తుత సీజన్లో లభించే పైనాపిల్, కర్బూజా దానిమ్మ, బత్తాయి... ఇలా అనేక రకాల పండ్లతో ఆలయాన్ని అందంగా అలంకరిస్తారు. ఒకప్పుడు పెద్ద పెద్ద ప్రముఖ ఆలయాల్లో మాత్రమే కనిపించే ఈ అలంకరణ సంప్రదాయం ప్రస్తుతం వీధుల్లోని చిన్న ఆలయాలకు సైతం చేరింది. క్వింటాళ్లలో కూరగాయలు కొనుగోలు చేసి మరీ అలంకరిస్తున్నారు.

ఆషాఢ మాసంలో శాకంబరీ దేవికి సారె కూడా సమర్పిస్తుంటారు. వర్షాలు కురిసి, పంటలు బాగా పండి, ప్రజలందరూ సుభిక్షంగా ఉండాలని కృతజ్ఞతాపూర్వకంగా రైతులు పిండి వంటలు, పండ్లు, స్వీట్లతో అమ్మవారికి సారె సమర్పిస్తారని పండితులు, ఆచార సంప్రదాయాలు తెలిసిన పెద్దలు చెప్తున్నారు.


కాకినాడలో బాలాత్రిపురసుందరి అమ్మవారి ఆలయాన్ని కూరగాయలతో తీర్చిదిద్దిన దృశ్యం


మోతుగూడెంలో అఖండ-2 సినిమా సందడి


సీలేరు నది తీరాన డ్రోన్ కెమెరాతో ట్రైలర్ షూటింగ్ చేస్తున్న డైరెక్టర్ బోయపాటి శీను



మోతుగూడెం, జూలై 21(ఆంధ్రజ్యోతి): చింతూరు మండలం మోతుగూడెం పరివాహక ప్రాంతాల్లో ఐదు రోజులు అఖండ-2 సినిమా చిత్రీకరణ జరగనుంది.అఖండ సినిమాకు దేశవ్యాప్తంగా వచ్చిన క్రేజ్‌తో అఖండ-2పై భారీ అంచనాలు ఉన్న నేపథ్యంలో దర్శకుడు బోయపాటి శీను సినిమా విషయంలో చాలా జాగ్రత్తలు తీసుకుంటున్నారు.బాలకృష్ణ కుమార్తె తేజస్విని సమర్పణలో నిర్మాతలు రామ్ ఆచంట, గోపీ ఆచంట నిర్మిస్తున్న అఖండ-2 చిత్రీకరణలో భాగంగా మోతుగూడెంలో బోయపాటి శ్రీను, చిత్ర బృందం కొన్ని సన్నివేశాలు చిత్రీకరిస్తున్నారు. ఏజెన్సీలో దట్టమైన అడవుల్లో, ఆంధ్ర, ఒడిస్సా సరిహద్దులో, మోతుగూడెం గ్రామంలోని సీలేరు నది పరివాహక ప్రాంతాలైన ధారాలమ్మ ఆలయ వెనుక సీలేరు నది, పొల్లూరు జలపాతం వద్ద చిత్రీకరణ ప్రారంభించారు. అగ్ర కథానాయకుడు బాలకృష్ణపై ఐదు రోజులపాటు కొన్ని సన్నివేశాలు చిత్రీకరించనున్నారు. ఈ సినిమా సెప్టెంబరు 25న విడుదల చేస్తామని దర్శకుడు బోయపాటి తెలిపారు.

చంద్రకుమార్‌కు గ్రేట్ క్రియేటివ్ ఆర్టిస్టు అవార్డు



చంద్రకుమార్ గీసిన ఆపరేషన్ సిందూర్ చిత్రం

అమలాపురం రూరల్, జూలై 21(ఆంధ్రజ్యోతి): క్రియేటివ్ హార్ట్స్ అకాడమీ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్ సంస్థ అధినేత ఆకొండి అంజి ఆధ్వర్యంలో సింధూర్-సెల్యూట్ ఇండియన్ సోల్జర్స్ అనే అంశంపై జాతీయస్థాయిలో చిత్రకళా పోటీలు నిర్వహించారు. 15 రాష్ట్రాల నుంచి 250 మంది చిత్రకారులు ఈ పోటీల్లో పాల్గొన్నారు. పాలగుమ్మి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల చిత్రలేఖన ఉపాధ్యాయుడిగా పని చేస్తున్న పోలిశెట్టి నరసింహ చంద్రకుమార్ గీసిన ఆపరేషన్ సిందూర్ చిత్రానికి గ్రేట్ క్రియేటివ్ ఆర్టిస్టు అవార్డు లభించింది. వింగ్ కమాండర్ వ్యోమికాసింగ్ (వైమానిక దళం), కల్నల్ సోఫియాఖురేషి(ఆర్మీ) చిత్రాన్ని వాటర్ కలర్స్ ఉపయోగించి ఆయన గీసారు. ఈ సందర్భంగా చంద్రకుమార్‌ను పలువురు అభినందించారు.

వైద్యం కోసం విజయవాడ వెళ్తుంటే..

లారీ ఢీకొని ఇద్దరి మృతి

కృష్ణా జిల్లా హనుమాన్ జంక్షన్ సమీపంలో ఘటన

తూర్పుగోదావరి జిల్లా దేవరపల్లి మండలం పల్లంట్లలో విషాదఛాయలు



రాఘవ (ఫైల్)



మృతిచెందిన పసలపూడి రాఘవ, యల్లమిల్లి భాస్కరరావు

దేవరపల్లి, జూలై 21 (ఆంధ్రజ్యోతి): లారీ ఢీకొన్న సంఘటనలో ఇద్దరు మృతిచెందారు. వివరాల ప్రకారం.. తూర్పుగోదావరి జిల్లా దేవరపల్లి మండలం పల్లంట్ల గ్రామానికి చెందిన పసలపూడి రాఘవ (25), తన బావ యల్లమిల్లి భాస్కరరావు(50)తో కలిసి సోమవారం విజయవాడ పయనమయ్యారు. తాడేపల్లిగూడెం మండలం జమ్మికృష్ణంపాలెనికి చెందిన భాస్కరరావు గత కొంతకాలంగా పక్షవాతంతో బాధపడుతున్నాడు. దీంతో వైద్యం నిమిత్తం వారిద్దరు పల్లంట్ల నుంచి విజయవాడ ఆసుపత్రికి మోటర్‌సైకిల్‌పై వెళ్తుండగా కృష్ణా జిల్లా హనుమాన్ జంక్షన్ సమీపంలోని పాములపాడు వద్ద లారీ ఢీకొంది. దీంతో ఇద్దరు అక్కడికక్కడే మృతిచెందారు. రాఘవ పెయింటర్‌గా పనిచేస్తున్నాడని కుటుంబసభ్యులు తెలిపారు. ఇద్దరి మృతితో పల్లంట్ల గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

మంచినీరు అడిగి..

మహిళ మెడలో పుస్తెలతాడు లాక్కుని పరారీ

మామిడికుదురు, జూలై 21 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మామిడికుదురు మండలం పాశర్లపూడి గ్రామంలో మహిళ మెడలో పుస్తెలతాడు లాక్కుని దుండగుడు పరారైన సంఘటన ఆదివారం రాత్రి జరిగింది. నగరం ఎస్ఐ చైతన్యకుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. పాశర్లపూడి గ్రామానికి చెందిన వలవల వరలక్ష్మి ఇంటికి గుర్తు తెలియని వ్యక్తి వచ్చి తాగేందుకు మంచినీరు కావాలని అడిగాడు. నీటిని తీసుకెళ్లి కొంతసేపటి తరువాత మళ్లీ వచ్చి మీ సెల్‌ఫోన్ ఇవ్వమని అడగడంతో ఆమె నిరాకరించింది. దీంతో అతడు మహిళ గొంతును పట్టుకునేందుకు ప్రయత్నించగా కేకలు వేయడానికి ప్రయత్నించగా బెదిరించి నోరు నొక్కి, మెడలోని రెండున్నర కాసుల పుస్తెల తాడును తెంచుకుని మోటారు సైకిల్‌పై పారిపోయాడు. దీనిపై బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ చైతన్యకుమార్ పేర్కొన్నారు.

దారి కాచి దొంగతనం

- ఎనిమిది మంది అరెస్టు
- నిందితుల్లో నలుగురు మైనర్లు
- మూడు మోటార్‌సైకిళ్లు, సెల్‌ఫోన్ స్వాధీనం



బిక్కవోలు పోలీస్‌స్టేషన్‌లో వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ విద్య, అనపర్తి సీఐ సుమంత్

బిక్కవోలు, జూలై 21 (ఆంధ్రజ్యోతి): మద్యం మత్తులో దారి కాచి దొంగతనం చేసిన ఎనిమిది మందిని అరెస్టు చేసినట్టు డీఎస్పీ బి.విద్య తెలిపారు. సోమవారం తూర్పుగోదావరి జిల్లా బిక్కవోలు పోలీస్‌స్టేషన్‌లో డీఎస్పీ, అనపర్తి సీఐ సుమంత్ విలేకర్ల సమావేశం నిర్వహించి వివరాలు వెల్లడించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ ఊలపల్లికి చెందిన కరుపోతు వరప్రసాద్ గోకవరం ఆర్టీసీ డిపోలో కండక్టర్‌గా పనిచేస్తున్నాడు. ఈనెల 17న అర్ధరాత్రి విధులు ముగించుకుని బైక్‌పై ఇంటికి వస్తుండగా బలభద్రపురం ఫ్లైఓవర్ బ్రిడ్జిపైకి వచ్చేసరికి రాజానగరం వైపు 3 బైక్‌లపై వెళ్తున్న ఎనిమిది మంది అడ్డగించి భయభ్రాంతులకు గురి చేసి అతడి వద్ద ఉన్న రూ.1550 నగదు, సెల్‌ఫోన్ లాక్కుని పోయారు. దీంతో వరప్రసాద్ 112కు ఫోన్ చేయగా బిక్కవోలు పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి అతడి నుంచి ఫిర్యాదు తీసుకుని కేసు నమోదు చేశారు. దీంతో సీఐ సుమంత్, ఎస్ఐ రవిచంద్రకుమార్, సిబ్బందితో దర్యాప్తు జరిపి ఎనిమిది మంది నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపారని డీఎస్పీ తెలిపారు. రిమాండ్‌కు పంపిన వారిలో బిక్కవోలు మండలం ఊలపల్లికి చెందిన బదిరెడ్డి శ్రీసాయి, ఖండవిల్లి సాయి, రాయవరం మండలం వెదురుపాక సావరం గ్రామానికి చెందిన మేడిశెట్టి కుమార్, కురుపూడి అభిలాష్, నలుగురు బాల నేరస్తులు ఉన్నారని చెప్పారు. నిందితుల నుంచి మూడు మోటార్‌సైకిళ్లు, సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్నారని వివరించారు.

గంజాయితో ఏడుగురి అరెస్ట్

5 కిలోల గంజాయితో పాటు రూ.3 వేల నగదు, 5 సెల్‌ఫోన్లు స్వాధీనం



నిడదవోలు పోలీస్ స్టేషన్‌లో కేసు వివరాలు వెల్లడిస్తున్న ఎస్ఐ జగన్మోహనరావు

నిడదవోలు, జూలై 21 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా నిడదవోలు జగనన్న కాలనీలో గంజాయితో ఏడుగురు వ్యక్తులను అరెస్ట్ చేసి 5 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నామని ఎస్ఐ కె.జగన్మోహనరావు తెలిపారు. ఆదివారం రాత్రి సీఐ పీవీజీ తిలక్ ఆదేశాలతో తమకు వచ్చిన సమాచారంతో దాడి చేశామన్నారు. జగనన్న కాలనీకి చెందిన వెలిచర్ల నాగరాజు, ఉజ్జినవారి వీధికి చెందిన చవాన్ పండు, కాకివారి వీధికి చెందిన కాకి కార్తీక్, ఎన్టీఆర్ కాలనీకి చెందిన నక్కల రసీల్, శాంతినగర్‌కు చెందిన మహ్మద్ దస్తగిరి అలియాస్ సమీర్, ఉజ్జినవారి వీధికి చెందిన గేదెల హేమంత్ నాగదుర్గ, చర్చిపేటకు చెందిన దూలపల్లి రాజేష్ కుమార్‌ను అరెస్ట్ చేశామన్నారు. వారి నుంచి స్వాధీనం చేసుకున్న 5 కిలోల గంజాయి సుమారు రూ.40వేలు ఉంటుందని, అలాగే రూ.3 వేల నగదు, 5 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. రాజమండ్రి హుకుంపేటకు చెందిన పసుపులేటి కీర్తన వద్ద గంజాయిని కొనుగోలు చేసి వారంతా కాలేజీల వద్ద 50 గ్రాములు రూ.500 రూపాయిల చొప్పున విక్రయిస్తుంటారని పేర్కొన్నారు. వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని చెప్పారు.

మద్యం దుకాణంలో రూ.3.5 లక్షల నగదు చోరీ

మండపేట, జూలై 21(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మండపేట మండలం ఏడిద దుళ్లరోడ్డులో ఉన్న మద్యం దుకాణంలో ఆదివారం అర్ధరాత్రి దొంగలు పడి రూ.3.5లక్షల నగదుతో పాటు దుకాణంలో ఉన్న సీసీ కెమెరా హార్డ్‌డిస్క్‌ను చోరీ చేశారు. సోమవారం ఉదయం దుకాణం నిర్వాహకులు తెరిచేందుకువెళ్లగా చోరీ జరిగినట్టు గుర్తించారు. సంఘటనా ప్రదేశాన్ని రామచంద్రపురం ట్రైనీ డీఎస్పీ ప్రదీప్తి, రూరల్ సీఐ దొరరాజు, ఎస్ఐ కిషోర్, క్లూస్‌టీం పరిశీలించారు. జరిగిన సంఘటనపై యాజమాని నుంచి ఆరాతీశారు. యాజమాని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

ఆగస్టు 1న నాలుగు రాష్ట్రాల మాదిగ న్యాయవాదులతో ప్రత్యేక సమావేశం

అన్నవరం, జూలై 21 (ఆంధ్రజ్యోతి): మాదిగలకు రిజర్వేషన్ కల్పిస్తూ సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుకు ఏడాది పూర్తవుతున్న నేపథ్యంలో ఆగస్టు 1న తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో ఆంధ్ర, తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల నుంచి మాదిగ న్యాయవాదులతో ప్రత్యేక సమావేశం నిర్వహించడం జరుగుతుందని మాదిగ న్యాయవాదుల ఫెడరేషన్ జాతీయ అధ్యక్షుడు వీవీ.రత్నం పేర్కొన్నారు. సోమవారం కాకినాడ జిల్లా అన్నవరంలో సత్యదేవుడిని దర్శించుకున్న ఆయన కొండదిగువున మీడియా సమావేశం నిర్వహించారు. ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ ఆరోగ్యం బాగుండాలని పూజలు నిర్వహించామన్నారు. రాజమహేంద్రవరం సమావేశంలో సుమారు 4వేలమంది మాదిగ న్యాయవాదుల సమక్షంలో వారికి ఘనసన్మానం నిర్వహించడం జరుగుతుందన్నారు. ప్రతి ఒక్క మాదిగ న్యాయవాది ఈ కార్యక్రమానికి తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు కిలాడి దయానందరావు, పలివెల సతీష్, కొత్తపల్లి ప్రసాదరావు, జయరాజ్, కొండేపూడి ఉదయ్‌కుమార్ ఉన్నారు.



అన్నవరం సమావేశంలో మాట్లాడుతున్న వీవీ రత్నం

రూ.1.5 కోట్ల విలువైన స్థలం స్వాధీనం

ట్రిబ్యునల్ ఆదేశాలతో దేవదాయశాఖ అధికారుల చర్యలు



ఎడ్యుకేషనల్ ట్రస్టు స్థలం స్వాధీనం చేసుకున్న అధికారులు

రామచంద్రపురం(ద్రాక్షారామ), జూలై 21 (ఆంధ్రజ్యోతి): కోనసీమ జిల్లా రామచంద్రపురం కృత్తివెంటి పేర్రాజుపంతులు ఎడ్యుకేషనల్ ట్రస్టుకు చెందిన రూ.1.5 కోట్ల విలువైన 45 సెంట్ల స్థలాన్ని సోమవారం దేవదాయశాఖ అధికారు లు స్వాధీనం చేసుకున్నారు. రామచంద్రపురం ద్రాక్షారామ మెయిన్‌రోడ్డు పక్కన ఉన్న కృత్తివెంటి పేర్రాజు పంతులు ఎడ్యుకేషన్ ట్రస్టుకు చెందిన 45 సెంట్ల స్థలంలో ప్రయివేటు వ్యక్తులు సామిల్లు నిర్వహిస్తున్నారు. గతంలో జిల్లా పరిషత్‌కు లీజు చెల్లించేవారు. తదుపరి దేవదాయ శాఖకు జెడ్పీ నుంచి ఆస్తులు బదిలీఅయిన తరువాత కొంత కాలంపాటు పేర్రాజుపంతులు ఎడ్యుకేషన్ ట్రస్టుకు లీజు చెల్లించారు. తదుపరి ఎటువంటి లీజు చెల్లించకపోవడంతో ఎడ్యుకేషనల్ ట్రస్టు ఈవో దేవదాయశాఖ ట్రిబునల్‌ను ఆశ్రయించారు. 45 సెంట్ల స్థలం కృత్తివెంటి పేర్రాజు పంతులు ఎడ్యుకేషనల్ ట్రస్టుకు స్వాధీనం చేయాలని ట్రిబ్యునల్ ఆదేశాలు ఇచ్చింది. ట్రిబ్యునల్ ఆదేశాల మేరకు సోమవారం జిల్లా దేవదాయశాఖ అధికారి వి.సత్యనారాయణ పర్యవేక్షణలో దేవదాయశాఖ డివిజన్ తనిఖీదారు బాలాజీరామ్ ప్రసాద్ ఆధ్వర్యంలో ఈవో ఎస్.సత్యనారాయణ ఆలయ సిబ్బంది స్థలంలో ప్రవేశించి స్వాధీనం చేసుకున్నారు. ముందుగా నోటీసు ఇచ్చిన ప్రకారం ఆక్రమణదారులు దేవదాయశాఖ అధికారులకు స్థలాన్ని అప్పగించారు. ఖాళీ స్థలంలో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. సత్యనారాయణ ఆదేశాల మేరకు స్థలానికి ఇనప కంచె ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో దేవదాయశాఖ పరిధిలో వివిధ ఆలయాల ఈవోలు జొన్నాడ భీమశంకరం, యాళ్లవీరవెంకట సత్యనారాయణ, వి.బాలకృష్ణ, వి.శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.

రైలు ఢీకొని మేకల కాపరి మృతి



మాధవరావు (ఫైల్)

తునిరూరల్, జూలై 21 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా తుని-గుల్లిపాడు రైల్వే స్టేషన్ల మధ్యలో సోమవారం రైలు ఢీకొని మేకల కాపరి మృతిచెందాడు. మృతుడు అనకాపల్లి జిల్లా పాయకరావుపేట మండలం సీతారామపురం గ్రామానికి చెందిన పక్కుర్తి చిన్నమాధవరావు(58)గా గుర్తించామని రైల్వే పోలీసులు తెలిపారు. మేకలను తోలుకెళ్తుండగా కొన్ని మేకలు రైల్వే ట్రాక్ పైకి వెళ్లడంతో వాటిని తరిమే క్రమంలో రైలు ఢీకొని మాధవరావు అక్కడికక్కడే మృతిచెందాడు. మృతదేహాన్ని ఏరియా ఆసుపత్రికి తరలించి శవపంచనామా అనంతరం సంబంధికులకు అప్పగించినట్టు రైల్వే ఎస్ఐ శ్రీనివాసరావు తెలిపారు.

ఫిట్స్‌తో పీక కోసుకున్న వ్యక్తి

చికిత్స పొందుతూ మృతి

కొవ్వూరు, జూలై 21 (ఆంధ్రజ్యోతి): పీక కోసుకుని చికిత్స పొందుతూ వ్యక్తి మృతిచెందినట్టు కొవ్వూరు రూరల్ ఎస్ఐ కె.శ్రీహరిరావు తెలిపారు. తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరు మండలం గోవర్ధనగిరిమెట్టకు చెందిన కాంద్రుకోట చిన్ని గత కొంతకాలంగా ఫిట్స్‌తో బాధపడుతున్నాడు. ఫిట్స్ వచ్చినప్పుడు తనను గాయపర్చుకుంటూ, ఇతరులను గాయపరిచేవాడు. ఈనెల 19న ఇంటి వద్ద ఫిట్స్ రావడంతో చాకుతో పీక కోసుకున్నాడు. దీంతో చికిత్స నిమిత్తం కొవ్వూరు ఆసుపత్రికి తరలించారు. అక్కడ నుంచి మెరుగైన వైద్యం నిమిత్తం రాజమహేంద్రవరం తరలించారు. చికిత్స పొందుతూ సోమవారం ఉదయం మృతిచెందాడు. ఈమేరకు అతడి భార్య సుబ్బలక్ష్మి ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ తెలిపారు.

హైదరాబాద్‌కు ముద్రగడ తరలింపు

యశోద ఆసుపత్రిలో అడ్మిట్ చేసిన కుటుంబసభ్యులు



కిర్లంపూడిలో ముద్రగడ స్వగృహం నుంచి హైదరాబాద్‌కు తరలిస్తున్న కుటుంబీకులు

కిర్లంపూడి, జూలై 21 (ఆంధ్రజ్యోతి): మూత్రపిండాల సమస్యతో మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభం రెండు రోజులుగా కాకినాడ మెడికవర్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. మెరుగైన వైద్యం కోసం కుటుంబీకులు హైదరాబాద్ తీసుకెళ్లి హైటెక్ సిటీలోని యశోద ఆసుపత్రిలో అడ్మిట్ చేశారు. సోమవారం ఆయన్ను మెడికవర్ ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ చేయగా వైద్యుల పర్యవేక్షణలో స్వగ్రామమైన కాకినాడ జిల్లా కిర్లంపూడికి తీసుకువచ్చారు. ముద్రగడ సతీమణి పద్మావతి, కుటుంబీకులు ఆయన్ను చూసి కలవరపడ్డారు. ముద్రగడను ఇంట్లో కొద్దిసేపు ఉంచి వెంటనే అంబులెన్స్ ద్వారా హైదరాబాద్‌కు తరలించారు. మాజీ మంత్రి తోట నరసింహం, జగ్గంపేట జనసేన ఇన్‌చార్జి తుమ్మలపల్లి రమేష్, ముద్రగడ అభిమానులు ముద్రగడ స్వగృహానికి చేరుకున్నారు. ఎవరూ అధైర్యపడవద్దని, ముద్రగడ ఆరోగ్యంగా ఉన్నారని మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ తరలిస్తున్నామని ఆయన కుమారుడు గిరిబాబు చెప్పారు.

గోదావరిలో గల్లంతైన ఇంజనీరింగ్ విద్యార్థి మృతదేహం లభ్యం



దినేష్ మృతదేహం

ఆత్రేయపురం, జూలై 21(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆత్రేయపురం మండలం వాడపల్లి శ్రీవేంకటేశ్వర స్వామి దర్శనానికి వచ్చి గౌతమి గోదావరి నదిలో శనివారం ఉదయం 5 గంటల సమయంలో స్నానం ఆచరిస్తుండగా ఖమ్మం జిల్లాకు చెందిన ఇంజనీరింగ్ విద్యార్థి పామర్తి దినేష్(22) గల్లంతయ్యాడు. శనివారం నుంచి సోమవారం వరకూ గాలింపు చర్యలు చేపట్టారు. ఆలయ ఉపకమిషనరు నల్లం సూర్యచక్రధరరావు, సీఐ విద్యాసాగర్, తహశీల్దార్ రాజేశ్వరరావు గాలింపు చర్యల్లో నిమగ్నమయ్యారు. జిల్లా కలెక్టర్ మహేష్‌కుమార్, ఫైర్, ఎస్‌డీఆర్ఎఫ్ బృందం, పోలీస్, గజఈతగాళ్లతో 3 బృందాలుగా విడిపోయి 30 మంది గాలింపు చేపట్టారు. సోమవారం మధ్యాహ్నం ముక్తేశ్వరం- కోటిపల్లి ఫెర్రి సమీపంలో దినేష్ మృతదేహం లభ్యమైంది. శవపంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం కొత్తపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎఎస్ఐ శ్రీనివాస్ పేర్కొన్నారు.

పూడ్చిపెట్టిన మృతదేహం వెలికితీత

తండ్రి మృతిపై కుమారుడి అనుమానం

కోనసీమ జిల్లా ఇప్పనపాడులో శవాన్ని పరిశీలించిన పోలీసులు



ఇప్పనపాడులో మృతదేహాన్ని బయటకు తీసి పరిశీలిస్తున్న పోలీసులు

మండపేట, జూలై 21 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఇప్పనపాడు పంచాయతీ పరిధిలోగల ఎర్రదిబ్బలకాలనీకి చెందిన వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతిచెందిన ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. దీంతో పూడ్చిపెట్టిన శవాన్ని వెలికితీసి పోస్టుమార్టం నిమిత్తం వైద్యులకు సిఫార్సు చేశారు. వివరాలు ఇలా ఉన్నాయి. ఇప్పనపాడుకి చెందిన వాకాడ వీర్రాజు(47) ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేసేవాడు. అతడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. వారికి వివాహాలు అయ్యాయి. వీర్రాజు కుమార్తె భర్తతో గొడవల కారణంగా తల్లితండ్రుల వద్ద ఉంటోంది. ఈనెల 17న వీర్రాజు భార్యతో గొడవపడ్డాడు. ఆ మరుసటి రోజు గుండెపోటుతో తన భర్త మరణించాడని ఆమె భార్య చుట్టుపక్కల వారిని నమ్మించే ప్రయత్నం చేసింది. కుమార్తె కూడా వీర్రాజు గుండెపోటుతో మరణించాడని చెప్పడంతో అంత్యక్రియలు నిర్వహించారు. వీర్రాజు కుమారుడు వచ్చిన తర్వాత తన తల్లి ఫోన్ సంభాషణ విని తండ్రి మరణానికి తల్లి, సోదరే కారణమని అనుమానం కలిగింది. దీంతో మండపేట రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ నేపథ్యంలో సోమవారం శవాన్ని వెలికి తీసి మండపేట రూరల్ సీఐ దొర్రాజు, మండపేట తహశీల్దార్ తేజేశ్వరరావు, పోలీసులు, వైద్యుల సమక్షంలో పరిశీలించారు. మృతదేహంపై గాయాలు ఉన్నట్టు గుర్తించారు. పోస్టుమార్టం రిపోర్ట్ వస్తే కాని ఏమీ చెప్పబోమని పోలీసులు తెలిపారు. నిద్రిస్తున్న వీర్రాజును హత్యచేసి గుండెపోటుగా చిత్రీకరించే ప్రయత్నం జరిగిందని కుమారుడు ఆరోపించాడు.

బైక్ ఢీకొని ఇద్దరికి తీవ్రగాయాలు

కొవ్వూరు, జూలై 21(ఆంధ్రజ్యోతి): బైక్ ఢీకొని ఇద్దరికి తీవ్రగాయాలైనట్టు కొవ్వూరు పట్టణ ఏఎస్ఐ జి.శ్రీనివాస్ తెలిపారు. తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరు మండలం వేములూరు గ్రామానికి చెందిన కొనగళ్ళ సూర్యచంద్రం టీవీఎస్ ఎక్స్ఎల్‌పై కొవ్వూరు వస్తుండగా ఎదురుగా బైక్ ఢీకొంది. రెండు వాహనాలపై ఉన్న ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం రాజమహేంద్రవరం అక్కడి నుంచి కాకినాడ ఆసుపత్రికి తరలించారు. సూర్యచంద్రం కుమారుడు ప్రసాద్ ఫిర్యాదుపై కేసు నమోదు చేసినట్టు ఏఎస్ఐ శ్రీనివాస్ తెలిపారు.

కందికుప్పలో విషజ్వరాలు

వైద్యశిబిరాలు ఏర్పాటు చేసిన అధికారులు

కాట్రేనికోన, జూలై 21(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కాట్రేనికోన మండలం కందికుప్ప పంచాయతీ జమ్మిచెరువు కాలనీలో విషజ్వరాలు ప్రబలడంతో స్థానికులు ఆందోళన చెందుతున్నారు. కాళ్లు చేతులూ, శరీర కండరాలు మెలిపెడుతున్న నొప్పితో డెంగ్యూ, మలేరియా జ్వరాలుగా భావించి భయానక వాతావరణం నెలకొంది. గత వారం రోజులుగా విషజ్వరాలతో బాధపడుతున్న గ్రామస్తులు అమలాపురం ఏరియా ఆసుపత్రికి వెళ్లగా సరైన సౌకర్యాలు లేకపోవడంతో ముమ్మిడివరం ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. వైద్య సిబ్బంది ముందు జాగ్రత్త చర్యగా గ్రామంలో ఆరోగ్య శిబిరాలు ఏర్పాటు చేశారు. అవసరమైన మందులు అందిస్తున్నారు. దోమలతో పాటు ఇక్కడ మలేరియా, పచ్చకామెర్లు వంటి వ్యాధులు రావచ్చని ప్రజలు భయపడుతున్నారు. గత నాలుగు రోజులుగా కుళాయిల ద్వారా మట్టినీళ్లు వస్తున్నాయని అంటున్నారు. ఈ కలుషిత నీటి వల్ల డెంగ్యూ, మలేరియా, అతిసార, పచ్చకామెర్లు వంటి వ్యాధులు వ్యాప్తి చెందే ప్రమాదముందని ప్రజలు భయపడుతున్నారు.



కందికుప్పలో కలుషిత నీరు

మోడల్ ప్రాథమిక పాఠశాలల్లో...

మౌలిక సదుపాయాల పరిశీలనకు కమిటీలు

తొండంగి, జూలై 21 (ఆంధ్రజ్యోతి): మోడల్ ప్రాథమిక పాఠశాలల్లో మౌలిక సదుపాయాల పరిశీలనకు ప్రభుత్వం కమిటీలను ఏర్పాటు చేసింది. ఈ మేరకు మండల విద్యాకేంద్రాలకు సర్క్యులర్ అందింది. దీని ప్రకారం ఎంఈవో, క్లస్టర్ హెచ్ఎం, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఆ గ్రామ ఇంజనీరింగ్ అసిస్టెంట్ సభ్యులుగా గల బృందాలు పాఠశాలలను సందర్శించనున్నాయి. గతంలో మోడల్ ప్రాథమిక పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పన కోసం ఇంజనీరింగ్ అసిస్టెంట్లు ఇన్‌పుట్ డేటా షీటు అప్ లోడ్ చేశారు. దీనిని అనుసరించి కమిటీ సభ్యులు అక్కడి అవసరాలను గుర్తించి నివేదికను సమర్పించవలసి ఉంది. క్లాస్ రూమ్ పార్టిషన్, వరండాను క్లాస్ రూంగా మార్చడం, గ్రీన్‌చాక్ బోర్డుల ఇండెంట్, కాంప్లెక్స్ పరిధిలో ఉన్న ఇతర పాఠశాలల్లో మిగులు ఫర్నీచర్ తదితర వస్తువులను అవసరం ఉన్న పాఠశాలలకు సమకూర్చడం తదితర అంశాలు కమిటీ పరిశీలిస్తుంది. మండలంలో ఎంఈవో 1, 2 ల ఆధ్వర్యంలో రెండు కమిటీలు పాఠశాలలను పరిశీలించి నివేదిక అందించాలని విద్యాశాఖ ఆదేశించింది.

అరుణాచలేశ్వరునికి

విశిష్ట అభిషేకాలు



అభిషేక దృశ్యం

ప్రత్తిపాడు, జూలై 21 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండలం రాచపల్లి అడ్డురోడ్డు వద్ద ఉన్న అపీత కుచాంబ అరుణాచలేశ్వరునికి సోమవారం అభిషేకాలు, విశిష్టపూజలు నిర్వహించారు. పంచామృతాలతో గంధం, వివిధ రకాల పండ్ల రసాలతో అరుణాచలేశ్వరునికిఅభిషేకాలు చేశారు.

ఐదు ఆసుపత్రులు తిప్పినా దక్కని శిశువు ప్రాణం

అల్లూరి జిల్లా ఓకుర్తిలో ఘటన

రాజవొమ్మంగి, జూలై 21 (ఆంధ్రజ్యోతి): అనారోగ్యానికి గురైన శిశువుకు మెరుగైన వైద్యం అందించేందుకు ఐదు ఆసుపత్రులు తిప్పి చివరకు కాకినాడ జీజీహెచ్‌కు తీసుకువెళ్లినా ప్రాణం పోయిన ఘటన అల్లూరి జిల్లా రాజవొమ్మంగి మండలంలో జరిగింది. మండలంలోని వాతంగి పంచాయతీ ఓకుర్తి గ్రామానికి చెందిన గళ్ళెల సరోజ ఏప్రిల్‌లో మగబిడ్డకు జన్మనిచ్చింది. ఆ బిడ్డ జూలై 18న అనారోగ్యానికి గురికావడంతో జడ్డంగి పీహెచ్‌సీ, అక్కడ నుంచి మెరుగైన వైద్యానికి అడ్డతీగల సీహెచ్‌సీ, రంపచోడవరం ఏరియా ఆసుపత్రి, రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లి చివరకు కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్చారు. కాగా ఆ బిడ్డ 19న రాత్రి మరణించినట్లు కుటుంబీకులు తెలిపారు. దీనిపై ఇన్‌చార్జి సీడీపీవో దేవమణిని వివరణ కోరగా అంగన్‌వాడీ వర్కర్ వివరాలు తెలిపారని, అయితే స్పష్టత లేదని చెప్పడం గమనార్హం.

తల్లీ, కుమార్తెల అదృశ్యంపై కేసు

కొవ్వూరు, జూలై 21 (ఆంధ్రజ్యోతి): తల్లికుమార్తెల అదృశ్యంపై కేసు నమోదు చేసినట్టు మహిళా హెడ్ కానిస్టేబుల్ లలితకుమారి తెలిపారు. తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరు పట్టణానికి చెందిన మర్రి ఈశ్వరి, ఏడాదిన్నర కుమార్తెను తీసుకుని జూన్ నెలలో ఏలేశ్వరం అత్తగారింటి నుంచి కొవ్వూరు వచ్చింది. వారం రోజుల తరువాత ఏలేశ్వరం వెళ్లింది. అప్పటి నుంచి భర్త, అమ్మతో ఫోన్ మాట్లాడుతుంది. ఇటీవల తల్లి గుడిదాటి దివ్య కూతురు, మనుమరాలిని చూడడానికి వస్తున్నానని తెలపడంతో ఏలేశ్వరం వెళ్లలేదని తెలిసింది. దీంతో దివ్య పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేయగా హెడ్ కానిస్టేబుల్ కేసు నమోదు చేశారు.

సత్యదేవుడి సన్నిధిలో జగ్గయ్యపేట ఎమ్మెల్యే పూజలు



సత్యదేవుడి దర్శనానంతరం జగ్గయ్యపేట ఎమ్మెల్యే

అన్నవరం, జూలై 21 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన సత్యదేవుడి సన్నిధిలో సోమవారం జగ్గయ్యపేట ఎమ్మెల్యే శ్రీరామ్ రాజగోపాల్ తాతయ్య కుటుంబసభ్యులతో స్వామిని దర్శించి ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఆయనకు ఆలయ ఈవో సుబ్బారావు ఆలయ మర్యాదలతో ఘనస్వాగతం పలికారు. దర్శనానంతరం వేదపండితులు వారికి వేదాశీర్వచనాలు అందజేశారు. లలిత రైస్ ఇండస్ట్రీస్ మేనేజింగ్ డైరక్టర్లు నిర్మించిన ప్రసాదం తయారీభవనం, ఉచిత కల్యాణమండపాలను పరిశీలించారు. ఎగ్జిక్యూటీవ్ డైరక్టర్ మట్టే ఆదిత్య కృష్ణ తదితరులున్నారు.

మరిడమ్మ జాతరకు పోటెత్తిన భక్తులు

రూ.37.84 లక్షల ఆదాయం

పెద్దాపురం, జూలై 21 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పెద్దాపురం మరిడమ్మ జాతరకు ఆది, సోమవారాల్లో భక్తులు పోటెత్తారు. తెల్లవారుజాము నుంచే క్యూలైన్లలో బారులు తీరారు. సుమారు 35వేలమంది అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారని దేవస్థానం సహాయ కమిషనరు కురం విజయలక్ష్మి తెలిపారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచు కుని ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. పలు స్వచ్ఛంద సంస్థలు భక్తులకు మంచినీరు, చంటి పిల్లలకు పాలు, పులిహోర ప్రసాదం పంపిణీ చేశాయి. మరిడమ్మ హుండీల్లో కానుకలను దేవదాయ శాఖ అధికారుల సమక్షంలో సోమవారం లెక్కించారు. 34 రోజులకు రూ.37,84, 015 ఆదాయం వచ్చిందని విజయలక్ష్మి తెలిపారు. లెక్కింపులో సిబ్బంది రమణ, క్రాంతివీర్ తదితరులు పాల్గొన్నారు.



మరిడమ్మ హుండీల్లో భక్తులు సమర్పించిన కానుకలను లెక్కిస్తున్న దృశ్యం

రాజమహేంద్రవరం

• రాజమహేంద్రవరం సిటీ/ రూరల్ • రాజానగరం • అనపర్తి

ఆంధ్రజ్యోతి www.andhrajyothy.com

వైద్యులు అంకితభావంతో పనిచేయాలి

»» డీసీహెచ్ఎస్ డాక్టర్ పద్మ »» అనపర్తి ఏరియా ఆసుపత్రిలో ఆకస్మిక తనిఖీలు


ఆసుపత్రిలో తనిఖీలు చేస్తున్న డీసీహెచ్ఎస్ డాక్టర్ పద్మ

అనపర్తి, జూలై 21 (ఆంధ్రజ్యోతి): వైద్యులు అంకితభావంతో విధులు నిర్వర్తించాలని డీసీహెచ్ఎస్ డాక్టర్ పద్మ అన్నారు. సోమవారం అనపర్తి ఏరియా ఆసుపత్రిని ఆమె సందర్శించి తనిఖీలు నిర్వహించారు.సిబ్బంది హాజరు సహా పలు రికార్డులను పరిశీలించారు. వార్డుల్లో పర్యటించి రోగులకు అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. అనంతరం ఆసుపత్రి ప్రాంగణంలో నూతనంగా నిర్మిస్తున్న భవన నిర్మాణాలను ఆమె ఆసుపత్రి సూపరిండెంట్ డాక్టర్ తాడి రామగురెడ్డితో కలిసి పరిశీలించి నిర్మాణ వివరాలను అడిగి తెలుసుకున్నారు. అలాగే ల్యాబ్ ఏర్పాటుకు కేటాయించిన బ్లాక్‌లో జరుగుతున్న నిర్మాణ పనులను పరిశీలించి త్వరగా పనులు పూర్తి చేయాలని కాంట్రాక్టరుకు సూచించారు. కార్యక్రమంలో సీఎస్ ఆర్ఎమ్‌వో డాక్టర్ పద్మశ్రీ, డాక్టర్ తరుణ్, నర్సింగ్ సూపరిండెంట్ డాక్టర్ కరుణ, హెచ్‌డీఎస్ సభ్యుడు అన్నవరం పాల్గొన్నారు.

పనుల్లో అలసత్వం వహిస్తే సహించం

ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి


అనపర్తిలో అన్న క్యాంటీన్ నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే నల్లమిల్లి

అనపర్తి, జూలై 21(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన అన్న క్యాంటీన్ భవన నిర్మాణ పనుల్లో అలసత్వం వహిస్తే సహించేది లేదని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి హెచ్చరించారు. అనపర్తిలో జరుగుతున్న అన్న క్యాంటీన్ భవన నిర్మాణంలో నాణ్యత లోపించిందని వచ్చిన ఫిర్యాదుల మేరకు ఆయన సోమవారం క్యాంటీన్ నిర్మాణ పనులను పరిశీలించి నిర్మాణంలో పలు లోపాలను గుర్తించారు. దీంతో ఫోన్ ద్వారా కాంట్రాక్టరు, డీఈ, ఏఈలను భవన నాణ్యతపై ప్రశ్నించారు. పిల్లర్లలో నాణ్యత లేదని, పునాదుల్లో సైతం మట్టిని పూడ్చారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం మళ్లీ వస్తానని అధికారులు వచ్చి నాణ్యతపై వివరణ ఇవ్వాలన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నిర్మాణ పనుల్లో రాజీ పడబోమన్నారు. కార్యక్రమంలో సత్తి దేవదానరెడ్డి, దత్తుడు శ్రీను, రావాడ నాగు, చింతా ప్రకాశరెడ్డి, మలిడి ఆదినారాయణరెడ్డి, గొల్లు హేమతులసి, గంగాభవాని పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు

బీజేపీ జిల్లా ఉపాధ్యక్ష, కార్యదర్శులుగా ఎంపికైన మల్లిడి సురేంద్రరెడ్డి, గొల్లు హేమతులసి రామవరంలో ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డిని కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా వారిని ఎమ్మెల్యే సత్కరించి, జిల్లాలో బీజేపీ బలోపేతానికి కృషి చేయాలన్నారు.

శక్తి యాప్‌తో మహిళలకు భద్రత : సీఐ గణేష్


అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న సీఐ గణేష్

ధవళేశ్వరం, జూలై 21(ఆంధ్రజ్యోతి): శక్తి యాప్ మహిళల భద్రతకు భరోసా ఇస్తుందని ధవళేశ్వరం సీఐ టి.గణేష్ పేర్కొన్నారు. మహిళల భద్రత కోసం పోలీస్ శాఖ రూపొందించిన శక్తి యాప్‌పై స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో సీఐ మాట్లాడుతూ శక్తియాప్‌ను విద్యార్థినులు తమ సెల్‌ఫోన్‌లో డౌన్‌లోడ్ చేసుకుని రిజిస్ట్రేషన్ చేసుకోవడం వల్ల రక్షణ ఉంటుందన్నారు. అత్యవసర పరిస్థితుల్లో శక్తి యాప్ ద్వారా 112 నెంబర్‌కు డయల్ చేయడం వల్ల శక్తి టీం బృందాలు ఆపదలో ఉన్నవారి చెంతకు వెళ్లి రక్షిస్తారన్నారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాల గురించి ఈవ్‌టీజింగ్, బాల్య వివాహాలు వంటి వాటిపై సమాచారం అందించవచ్చని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎస్ఐలు క్రాంతి, హరిబాబు, ఎస్‌బీఏఎస్ఐ సుభాకర్, శక్తి టీం హెడ్ కానిస్టేబుల్ గోవిందు, అధ్యాపకులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలకు యువత దూరంగా ఉండాలి

రాజమహేంద్రవరం అర్బన్, జూలై 21 (ఆంధ్రజ్యోతి): యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని ప్రిన్సిపాల్ రామచంద్రరావు అన్నారు. సోమవారం రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా నషా ముక్త్ భారత్ బుర్రకథ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ మాదక ద్రవ్యాలకు బానిసలైతే యువశక్తి నిర్వీర్యమవుతుందని అన్నారు. విభూతి ఉమాశంకర్ కళాజాత బృందం బుర్రకథ ద్వారా మాదక ద్రవ్యాల వల్ల కలిగే దుష్పరిణామాలను వివరించారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ శ్రీరామమూర్తి, సహాయ ప్రిన్సిపాల్ జి.చంద్రశేఖర్, ఈగల్ క్లబ్ సమన్వయకర్త జల్లా సురేష్, తదితరులు పాల్గొన్నారు.

కాలేజీ బస్సులో విద్యార్థిపై దాడి

తీవ్రగాయాలు ఆసుపత్రికి తరలింపు

రంగంపేట, జూలై 21(ఆంధ్రజ్యోతి): ప్రైవేటు కాలేజీ బస్సులో ప్రయాణం చేస్తున్న విద్యార్థిపై ఆటోలో వచ్చిన విద్యార్థి దాడికి పాల్పడ్డాడు. ఎస్ఐ ఎస్ శివప్రసాద్ వివరాల ప్రకారం.. రాజమహేంద్రవరం రూరల్ పిడింగొయ్యి గ్రామానికి చెందిన రేలంగి సత్యసాయి శంకర్ సూరంపాలెం ప్రగతి ఇంజనీరింగ్ కాలేజిలో నాలుగో ఏడాది చదువుతున్నాడు. రోజూ కాలేజీ బస్సులో ఇంటి నుంచి కాలేజీకి వస్తుంటాడు. సోమవారం ఉదయం కాలేజీ బస్సులో వెళుతుండగా వడిశలేరు దాటిన తరువాత మణి, సాయి అనే విద్యార్థులు ఆటోలో వచ్చి బస్సులో ఉన్న శంకర్‌ను కొట్టి 'ఆ అమ్మాయితో మాట్లాడవద్దని ఎన్నిసార్లు చెప్పిన వినవా' అని బూతులు తిడుతూ మణి వెంట తెచ్చుకున్న చాకుతో ఛాతిపై పొడిచాడు. దీంతో తీవ్రంగా గాయపడిన శంకర్‌ను స్నేహితులు రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లగా మెరుగైన వైద్యం కోసం ప్రైవేటు ఆసుపత్రికి తరలించాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

మిల్లు యాజమాన్య వైఖరికి నిరసనగా నేటి నుంచి నిరవధిక దీక్ష

మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

రాజమహేంద్రవరం సిటీ, జూలై 21(ఆంధ్రజ్యోతి): పేపరుమిల్లు యాజమాన్య నిరంకుశ వైఖరిని నిరసిస్తూ ఈనెల 22 నుంచి నిరవధిక దీక్ష చేపడుతున్నానని వైసీపీ నేత, రాజానగరం మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా అన్నారు. స్థానిక కృష్ణసాయి కళ్యాణ మండపంలో సోమవారం రాత్రి జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పేపరుమిల్లు కార్మికుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించడంలో మిల్లు యాజమాన్యం నిర్లక్ష్యంగా ఉందన్నారు. ఈ సమస్యను కూటమి ప్రభుత్వంలోని ప్రజా ప్రతినిధులు పరిష్కరిస్తారని వేచి చూశామని అయితే సమస్య పరిష్కారంలో తీవ్రజాప్యం జరుతున్న నేపథ్యంలో మిల్లు యాజమాన్యంతో తాడోపేడో తేల్చుకోవడానికి సిద్ధమవుతున్నామన్నారు. ఈనెల 22న పేపరుమిల్లు గేటు ఎదురుగా ఉన్న దివంగత సీఎం వైఎస్ఆర్ విగ్రహం వద్ద దీక్షకు కూర్చుంటున్నానని రాజా ప్రకటించారు. పేపరుమిల్లు కార్మికులకు మూడేళ్ల క్రితమే వేతన ఒప్పందం జరగాల్సివుందన్నారు. వేతన ఒప్పందంతో పాటు కార్మికులకు న్యాయపరంగా అందించాల్సిన సౌకర్యాలు కల్పించడంలోను మిల్లు యాజమాన్యం మొండిగా వ్యవహరిస్తుందన్నారు. సమావేశంలో శ్రీనివాస్, మాజీ కార్పొరేటర్ బొంత శ్రీహరి, మానె దొరబాబు, ఇసుకపల్లి శ్రీనివాస్, మాసా రామ్‌జోగ్, బురిడి త్రిమూర్తులు, అడపా అనిల్, కోడి కోట, నాళం రోశయ్య పాల్గొన్నారు.

విద్యార్థికి ఆర్థిక సాయం

రాజమహేంద్రవరం సిటీ, జూలై 21(ఆంధ్రజ్యోతి): పేద విద్యార్థి ఉన్నత చదువు నిమిత్తం ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు ఆర్థిక సాయం అందజేశారు. సోమవారం స్థానిక తిలక్ రోడ్డులోని తన కార్యాలయంలో 44వ డివిజన్‌కు చెందిన ఐఐటీ చదువుతున్న పేద విద్యార్థి సాకా విశాల్ సందేశ్‌కు రూ.20 వేలు నగదును ఎమ్మెల్యే వాసు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ భవాని చారిటబుల్ ట్రస్ట్ ద్వారా ఇటువంటి సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. పేద విద్యార్థులకు ఫీజులు కోసం ,పేదలకు వైద్య ఖర్చుల కోసం ఆర్థిక సహాయం చేయడం తాము ఆనవాయితీగా పెట్టుకున్నామన్నారు. కార్యక్రమంలో జవ్వాది విజయలక్ష్మి, టీడీపీ నాయకులు వంజరపు శంకర్, పాలవలస బ్రహ్మాజీ పాల్గొన్నారు.

పాలిటెక్నిక్ విద్యార్థులకు ఉద్యోగావకాశాలు మెండు

రాజానగరం, జూలై 21(ఆంధ్రజ్యోతి): ప్రస్తుత పోటీ ప్రపంచంలో ఇంజనీరింగ్ విద్యార్థులతో సమానంగా పాలిటెక్నిక్ విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు మెండుగా ఉన్నాయని గోదావరి గ్లోబల్ విశ్వవిద్యాలయం(జీజీయూ) ప్రొచాన్సలర్ కేవీబీ రాజు అన్నారు. జీజీయూ ప్రాంగణంలోని గైట్ పాలిటెక్నిక్ కళాశాలలో నూతన విద్యా సంవత్సరం ప్రారంభం సందర్భంగా ప్రథమ సంవత్సరం విద్యార్థులు, తల్లిదండ్రులతో ఓరియంటేషన్ కార్యక్రమం నిర్వహించారు. పాలిటెక్నిక్ పూర్తి చేసిన అనంతరం విద్యార్థులు వారి ఆసక్తి మేరకు ఉన్నత విద్యాభ్యాసం చేసేందుకు, బహుళజాతి సంస్థల్లో ఉద్యోగాలను అందిపుచ్చుకునేందుకు అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ పీజీ రామాంజనేయులు, జీజీయూ రిజిస్ట్రార్ పీఎంఎంఎస్ శర్మ, టి.జయానందకుమార్, రామారావు, కిరణ్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

జాబ్‌మేళా పోస్టర్ ఆవిష్కరణ

అనపర్తి, జూలై 21 (ఆంధ్రజ్యోతి): ఈనెల 26న అనపర్తిలో ఏపీ నైపుణ్య అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించే జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి కోరారు. సోమవారం బిక్కవోలు పర్యటన సందర్భంగా ఆమె జాబ్ మేళా పోస్టర్‌ను ఆవిష్కరించారు. మేళాలో పదికి పైగా ప్రముఖ కంపెనీలు పాల్గొంటున్నాయన్నారు.

గేదెలు పోతున్నా.. పట్టదా!

»» బాధితులు ఫిర్యాదు చేసినా పట్టించుకోని పోలీసులు
»» దిక్కుతోచని స్థితిలో రైతులు
»» తాజాగా తూర్పుగోనగూడెంలో రెండు గేదెలు అపహరణ


తూర్పుగోనగూడెంలో ఆదివారం రాత్రి పాడి గేదెలు అపహరణకు గురవ్వడంతో ఒంటరిగా మిగిలిన దూడ

రాజానగరం, జూలై 21(ఆంధ్రజ్యోతి): రాజానగరం పోలీస్ స్టేషన్ పరిధిలో కొన్నేళ్లుగా పాడి గేదెల దొంగతనాలు యథేచ్ఛగా జరుగుతున్నా పోలీసులు పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.దీంతో పాడి గేదెలనే జీవనాధారంగా చేసుకుని కుటుంబాలను పోషించుకుంటున్న కొంతమంది రైతులు, యజమానులు దిక్కుతోచని స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు. బాధిత యజమానులు పనులు మానుకుని పోలీస్‌స్టేషన్ చుట్టూ కాళ్లరిగేలా తిరిగి తిరిగి చేసేది లేక దిగు లు చెందుతున్నారు. పాడి పశువులు, గేదెలు దొంగతనాలకు సం బంధించి ఇప్పటివరకు ఒక కేసు పోలీసులు ఛేదించలేకపోయారు. తూర్పుగోనగూడెంలో గతంలో ఓ రైతుకు చెందిన పాడి గేదెలను రాత్రి సమయంలో అప హరించుకుపోయారు. దీనిపై బాధిత యజమాని పోలీసుల చుట్టూ తిరగలేక మిన్నకుండిపోయారు.విస్తృత పరిధి కలిగిన రాజానగరం పోలీస్ స్టేషన్‌కు ఒక సీఐ, నలుగురు ఎస్ఐలు, 30 మందికి పైబడి కానిస్టేబుళ్లు విధులు నిర్వర్తిస్తున్నారు. జాతీయ రహదారిపై ప్రయాణిస్తున్న పశువుల లారీల నుంచి డబ్బు వసూళ్లపై ఉన్న శ్రద్ధ మండలంలో నిత్యం జరుగుతున్న దొంగతనాలను అరికట్టడంలో గానీ, దొంగలను పట్టుకోవడంలో గానీ లేదని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు.

రెండు పాడిగేదెలు అపహరణ

మండలంలోని తూర్పుగోనగూడెం గ్రామానికి చెందిన అబ్బిరెడ్డి పుల్లయ్యకు చెందిన రెండు పాడి గేదెలను ఆదివారం రాత్రి దొంగలు అపహరించుకుపోయారు. బాధిత యజమాని పాడి గేదెలనే జీవనాధారంగా కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. గ్రామ శివారులోని వడిశలేరు రోడ్డులో మకాంలో కట్టిన రెండు గేదెలను వాహనంలో ఎక్కుంచుకుపోయి, లేగ దూడలను అక్కడే వదిలిపెట్టారు. చోరీకి గురైన గేదెల విలువ రూ.2 లక్షలు వరకు ఉంటుందని బాధిత యజమాని బోరున విలపించారు. ఈ విషయమైన అతడు సోమవారం ఉదయం రాజానగరం పోలీసులకు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు.

సమస్యలపై ఫిర్యాదుకు డయల్ 1100

»» ఆర్డీవో కృష్ణనాయక్
»» పీజీఆర్ఎస్‌లో అర్జీల స్వీకరణ



సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న దృశ్యం

రాజమహేంద్రవరం అర్బన్, జూలై 21(ఆంధ్రజ్యోతి): ప్రజలు 1100కి ఫోన్ చేసి తమ సమస్యలు, ఫిర్యాదులు తెలియజేయవచ్చని రాజమహేంద్రవరం ఆర్డీవో ఆర్.కృష్ణనాయక్ పేర్కొన్నారు. సోమవారం రాజమహేంద్రవరం సబ్ కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్)లో వచ్చిన ఫిర్యాదులు, అర్జీలను డివిజన్ స్థాయి అధికారులతో కలసి ఆయన స్వీకరించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ ప్రజల నుంచి తొమ్మిది అర్జీలు అందాయని అన్నారు. పీజీఆర్ఎస్‌లో ప్రజల నుంచి అందిన అర్జీలను నిర్ణీత కాలవ్యవధిలో పరిష్కరించి దరఖాస్తు దారునికి న్యాయం చేయాలని అధికారులను ఆదేశించారు. వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి

రాష్ట్రవ్యాప్తంగా విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని, నిరుద్యోగ భృతి రూ.3,000 చెల్లించాలని పీడీఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.కిరణ్‌కుమార్ డిమాండ్ చేశారు. సోమవారం సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. అనంతరం ఆర్డీవో కృష్ణనాయక్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కిరణ్‌కుమార్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా కేజీ నుంచి పీజీ వరకూ విద్యార్థులు సమస్యలు ఎదుర్కొంటున్నారని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది గడిచినా, అకడమిక్ సంవత్సరం ప్రారంభమై నెలన్నర కావస్తున్నా సమస్యలు అపరిష్కృతంగానే ఉన్నాయని, తక్షణమే సమస్యలు పరిష్కరించాలని అన్నారు. కార్పొరేట్, ప్రైవేట్ విద్యాసంస్థల్లో వివిధ రకాలైన ఫీజుల దోపిడీ అరికట్టాలని, హాస్టల్ విద్యార్థులకు మెస్, కాస్మోటిక్ ఛార్జీలు పెంచాలని అన్నారు. జూలై 25న విజయవాడలో నిర్వహించే మహాధర్నాలో విద్యార్థులు భారీగా పాల్గొనాలని కోరారు. ఈ ధర్నాలో పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షులు భాను, దినేష్, సిటీ కార్యదర్శి ఇళ్ల చంద్రశేఖర్, జిల్లా ఉపాధ్యక్షుడు ధర్మేష్, శ్రీను, రోహిత్, దివ్య, కల్యాణి పాల్గొన్నారు.

అర్జీలను సత్వరం పరిష్కరించాలి

రాజమహేంద్రవరం సిటీ, జూలై 21(ఆంధ్రజ్యోతి): ప్రజల నుంచి వస్తున్న అర్జీలకు సత్వర పరిష్కారం చూపించే దిశగా అధికారులు, ఉద్యోగులు చర్యలు చేపట్టాలని కార్పొరేషన్ అడిషనల్ కమిషనర్ పీవీ రామలింగేశ్వర్ సూచించారు. సోమవారం కార్పొరేషన్ కార్యాలయంలో జరిగిన పీజీఆర్ఎస్‌లో ప్రజల నుంచి ఆయన అర్జీలను స్వీకరించారు. ప్రజల నుంచి ఇంజనీరింగ్ విభాగానికి 5, రెవెన్యూకి 5, టౌన్ ప్లానింగ్‌కి 5, వార్డు సచివాలయాలకు 2 అర్జీలు వచ్చాయన్నారు. ఈ అర్జీలను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని అధికారులకు సూచించారు. అలాగే ప్రభుత్వ సేవలు ప్రతి పౌరుడు పొందేలా హౌస్‌హోల్డ్ మ్యాపింగ్ తప్పనిసరిగా చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ ఎస్.వెంకటరమణ, సెక్రటరీ శైలజావల్లి, ఎంహెచ్‌వో డాక్టర్ వినూత్న, మేనేజరు ఎండీ అబ్దుల్‌మాలిక్, ఇతర అధికారులు పాల్గొన్నారు.


అర్జీలు స్వీకరిస్తున్న అడిషనల్ కమిషనర్ రామలింగేశ్వర్

దివ్యాంగుల సమస్యల పరిష్కారానికి కృషి

ధవళేశ్వరం, జూలై 21 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగుల సమస్యల సత్వర పరిష్కారానికి కృషి చేస్తానని దివ్యాంగుల సంక్షేమ శాఖ జిల్లా అధికారి వై.శ్రీనివాస్ పేర్కొన్నారు. సోమవారం స్థానిక స్ఫూర్తి చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ట్రస్టు ఛైర్మన్ ముత్యాల పోసికుమార్ నిర్వహించిన ఆత్మీయ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడుతూ దివ్యాంగులకు ఎటువంటి సమస్యలున్నా వాటి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. శ్రీనివాస్‌ను ట్రస్టు సభ్యులు సత్కరించారు. కార్యక్రమంలో కె.భరత్‌కుమార్, జేవీఆర్ సాగర్, ముత్యాల సత్య, బి.దుర్గ తదితరులు పాల్గొన్నారు.

పీఆర్టీయూ సభ్యత్వ నమోదు

కోరుకొండ, జూలై 21(ఆంధ్రజ్యోతి): పీఆర్టీయూ ఆధ్వర్యంలో సోమవారం ముమ్మర సభ్యత్వ నమోదు కార్యక్రమం జరిగింది. మండలంలోని అన్ని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలకు వెళ్లి పీఆర్టీయూ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో రాష్ట్ర పీఆర్టీయూ ఉపాధ్యక్షుడు సాంబశివరావు, రహిమాబేగం, పల్లా రాజారావు, శివన్నారాయణ, సాదె రాజు, కొత్తపల్లి శ్రీనివాసు, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

పేదరికాన్ని రూపుమాపేందుకే పీ4

ఎమ్మెల్యే ఆదిరెడ్డి, ఎమ్మెల్సీ సోము


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు

రాజమహేంద్రవరం సిటీ, జూలై 21(ఆంధ్రజ్యోతి): పేదరికాన్ని రూపుమాపేందుకే పీ4 బంగారు కుటుంబం-మార్గదర్శి కార్యక్రమాన్ని ప్రభుత్వం నిర్వహిస్తోందని ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు, ఎమ్మెల్సీ సోము వీర్రాజు అన్నారు. స్థానిక శ్రీ వెంకటేశ్వర ఆనం కళాకేంద్రంలో సోమవారం రాత్రి జరిగిన పీ4 సమావేశానికి వారు ముఖ్యఅతిథులుగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఆదిరెడ్డి వాసు మాట్లాడుతూ గ్యాస్ సిలెండర్, కరెంట్, నీటి కనెక్షన్ లేని కుటుంబాలు, ఆదాయ వనరులు లేని వారిని బంగారు కు టుంబాలుగా గుర్తించి వారి అభివృద్ధికి మద్దతుగా నిలవాలన్నారు. కార్పొరేషన్ విద్యార్థుల భవిష్యత్ దృష్ట్యా పేద కుటుంబాలకు చెందిన విద్యార్థులు పదో తరగతిలో 500 పైబడి మార్కులు సాధిస్తే వారిని ప్రైవేట్ కళాశాలలో ఇంటర్మీడియేట్ ఉచితం గా చదివించే విధంగా సీట్లు కల్పించడం అభినందనీయమన్నారు. ఈ ఏడాది 169 మందికి ఈ అవకాశం కల్పించామన్నారు. ఎమ్మెల్సీ సోము వీర్రాజు మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటి వరకు 490 బంగారు కుటుంబాలను గుర్తించామని, వీరి చిన్నారుల విద్య, తల్లిదండ్రుల ఉపాధి, కుటుంబ అభివృద్ధి కోసం ఉద్యోగులు ప్రాజెక్ట్ రిపోర్టులు తయారు చేయాలని సూచించారు. కార్పొరేషన్ అడిషనల్ కమిషనర్ పీవీ రామలింగేశ్వర్ మాట్లాడుతూ ఎంపిక చేసిన కుటుంబాల సమాచారం ఆధారంగా మార్గదర్శులను మ్యాపింగ్ చేసి అవసరాలకు అనుగుణంగా కార్యాచరణ చేపట్టాలన్నారు. ఇందుకోసం గ్రామ సభలు ప్రారంభిస్తున్నామని వచ్చే నెల 10వ తేదీలోగా ప్రక్రియ పూర్తి చేయాలని చెప్పారు. సమావేశంలో పలువురు నగర పాలక సంస్థ అధికారులు, వార్డు సచివాలయ సిబ్బంది, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

వరిలో నాణ్యమైన దిగుబడులకు శిక్షణ



రైతు సేవా కేంద్ర సిబ్బందికి శిక్షణ ఇస్తున్న శాస్త్రవేత్తలు

కోరుకొండ, జూలై 21 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత ఖరీఫ్ పంటకు సంబంధించి వరిలో నాణ్యమైన అధిక దిగుబడులు సాధించడం కోసం ఎలాంటి మెళకువలు పాటించాలో ఏరువాక కేంద్రం శాస్త్రవేత్తలు శిక్షణా తరగతులు నిర్వహించారు. ప్రస్తుతం వర్షాభావం వల్ల వరి పంటలకు నాట్లు ఆలస్యమవుతున్నాయన్నారు.ఈ నెలాఖరుకు నూరుశాతం నాట్లు పూర్తవుతాయని కొన్ని ముఖ్యమైన సాగు పద్ధతులైన రకాల ఎంపిక, పచ్చిరొట్ట ఎరువులు,విత్తన శుద్ధి, ఎరువుల యాజమాన్యం, చీడపీడల ఎలుకల నివారణ, పంట మార్పిడి, డ్రోన్ వినియోగం వంటి పద్ధతుల్లో మెళకువలు పాటిస్తే నాణ్యమైన, స్థిరమైన దిగుబడులు పొందవచ్చని జిల్లా ఏరువాక కేంద్రం కో ఆర్డినేటర్ చల్లా వెంకట నరసింహారావు పేర్కొన్నారు. నత్రజని, పొటాష్ ఎరువుల వినియోగ వంటి యాజమాన్య పద్ధతులు పాటించాలని కోరుకొండ ఏడీఏ మల్లికార్జునరావు సూచించారు. రైతుల సమగ్ర యాజమాన్యం పాటించాలన్నారు. ఈ సార్వాకు అధిక దిగుబడులు ఇచ్చే ఎరువులు ఎంపిక చేసుకోవాలన్నారు.భూమి పరీక్ష ఆధారిత పోషక యాజమాన్యం పాటించాలన్నారు. డివిజన్‌లో చేస్తున్న వివిధ శిక్షణా కార్యక్రమాలను గోకవరం వ్యవసాయాధికారి రాజశ్రీ వివరించారు.కాగా ఈ శిక్షణ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ సిబ్బంది మినహా రైతులెవరూ పాల్గొనకపోవడం గమనార్హం. కార్యక్రమంలో ఆత్మ బీటీఎం రాజశేఖర్, వ్యవసాయ శాస్త్రవేత్త మానుకొండ శ్రీనివాస్, వివిధ గ్రామాల వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.

మట్టి తవ్వకాలు నిలిపివేత

ప్రొక్లెయినర్, లారీ, ట్రాక్టర్ స్వాధీనం

కడియం, జూలై 21(ఆంధ్రజ్యోతి): మాధవరాయుడుపాలెం చైతన్యనగర్ పరిధిలోని ప్రభుత్వ భూమిలో జరుగుతున్న మట్టి తవ్వకాలను పోలీసులు నిలిపివేశారు. తమ ప్రాంతంలోని భూమిలో మట్టిని తవ్వి చెరువులను చేస్తున్నారని స్థానికులు ఇటీవల ఎమ్మెల్యే గోరంట్ల దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఆయన ఆదేశాలతో సోమవారం మట్టి తవ్వకాలు చేస్తున్న ప్రాంతానికి రెవెన్యూ, పోలీసు సిబ్బంది వెళ్లారు. తవ్వకాలకు అనుమతి లేదని లారీ, ప్రొక్లెయినర్, ట్రాక్టర్‌లను స్వాధీనం చేసుకుని పోలీసుస్టేషన్‌కు తరలించారు.

కోటపాడులో తొలి అడుగు

రంగంపేట, జూలై 21(ఆంధ్రజ్యోతి): సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా సోమవారం మండలంలోని కోటపాడు గ్రామంలో టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆళ్ల గోవిందు పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి ఈ ఏడాది కాలంలో గ్రామంలో చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరిస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు. గ్రామస్థులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత నియోజకవర్గంలో రూ.452.4 కోట్ల అభివృద్ధి పనులు చేశామని గోవిందు అన్నారు.కార్యక్రమంలో టీడీపీ, జనసేన మండలాధ్యక్షులు ఎలుగుబంటి సత్తిబాబు, గిరజాల సత్తిబాబు, నాయకులు అడబాల వెంకట్రావు, కడిమి సాయిబాబు, గుత్తుల సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

శాకంబరిగా బాలా త్రిపుర సుందరి



ధవళేశ్వరం, జూలై 21(ఆంధ్రజ్యోతి): ఆషాఢ మాసం సందర్భంగా స్థానిక బాలా త్రిపుర సుందరి సమేత అగస్త్యేశ్వర స్వామి ఆలయంలో సోమవారం అమ్మవారు శాకంబరి అలంకరణలో దర్శనమిచ్చారు. ఆలయ అర్చకులు విశ్వనాథ శర్మ సారథ్యంలో వివిధ రకాల కూరగాయలు, పండ్ల రకాలు, ఆకుకూరలతో అమ్మవారిని సుందర్భంగా అలంకరించారు. ఉపాలయాలు, ఆలయ ప్రాంగణం, ఆలయ శిబిరాన్ని కూరగాయలతో అలంకరించారు. అత్యంత సుందరంగా అలంకృతురాలైన అమ్మవారిని ఉదయం నుంచి అధిక సంఖ్యలో భక్తులు దర్శించి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

శ్రీరాజరాజేశ్వరికి సారె

రాజానగరం, జూలై 21(ఆంధ్రజ్యోతి): ఆషాఢమాసం సందర్భంగా రాజానగరంలోని శివాలయ ప్రాంగణంలోని శ్రీరాజరాజేశ్వరి అమ్మవారు సోమవారం శాకంబరి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. గ్రామానికి చెందిన కూరాకుల నరసింహమూర్తి దంపతులు వివిధ రకాలైన కూరగాయలు, పండ్లతో అమ్మవారిని అలంకరించారు. అలాగే పలు రకాలైన పిండి వంటలు, స్వీట్లు తయారు చేసి అమ్మవారికి సారె సమర్పించారు. శివ సేవా సమితి సభ్యులు, భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి అమ్మవారిని దర్శించుకున్నారు.

కోరుకొండలో అంకాలమ్మకు..

కోరుకొండ, జూలై 21 (ఆంధ్రజ్యోతి): కోరుకొండ గ్రామదేవత మాతృశ్రీ అంకాలమ్మకు మండల బ్రాహ్మణ సమాఖ్య ఆధ్వర్యంలో సారె సమర్పించారు. స్థానిక లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం నుంచి మేళతాళాలు, మంగళవాయిద్యాలు, వేద మంత్రోచ్చరణల మధ్య శ్రీ లక్ష్మీనరసింహ గాయిత్రి బ్రాహ్మణ సమాఖ్య సభ్యులు, మహిళలు కోలాట నృత్యాలతో రథం రోడ్డులో ఊరేగింపుగా వెళ్లి అంకాలమ్మకు సారె సమర్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ కర్రి లక్ష్మీసరోజ, ఎమ్మెల్యే సతీమణి బత్తుల వెంకటలక్ష్మీ, ఎంపీపీ ఉల్లి సూర్యకుమారి, బ్రాహ్మణ సమాఖ్య అధ్యక్షుడు కొత్తపల్లి భాస్కరరామ్, మర్ల వెంకట సీతారామశాస్త్రి, బదిరెడ్డి దొర, మాతా సీతారాముడు, పసుపులేటి బుల్లియ్యనాయుడు పాల్గొన్నారు.


కోరుకొండలో అంకాలమ్మకు సారె తీసుకెళ్తున్న మహిళలు


స్ట్రామ్ వాటర్ డ్రెయిన్ పనులపై ప్రశ్నిస్తున్న కలెక్టర్ ప్రశాంతి

వరదలా వానొచ్చే!

రాజమహేంద్రవరం సిటీ, జూలై 21(ఆంధ్రజ్యోతి): జిల్లావ్యాప్తంగా 19 మండలాల్లో సోమవారం 31.4 మి.మీ వర్షపాతం నమోదైంది. గడచిన 24 గంటల్లో అత్యధికంగా అనపర్తి,రాజమహేంద్రవరంలలో వర్షం కురిసింది. తెల్లవారుజామున చిరుజల్లులు పడ్డాయి. మరలా మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు భారీ వర్షం కురిసింది. దీంతో కొన్ని ప్రాంతాల్లో వర్షపు నీరు రోడ్డెక్కింది. మోరంపూడి ఫ్లయ్ ఓవర్‌పై భారీగా నీరు నిలిచిపోయింది. కాలువలా మారిపోయింది. దీంతో ట్రాఫిక్‌ను మళ్లించారు. కోరుకొండ రోడ్డు, పేపరుమిల్లు రోడ్డు, కృష్ణనగర్, కంబాలచెరువు ప్రాంతాల్లో వర్షపునీరు రోడ్లపై ప్రవహించింది. సాయంత్రం విద్యార్థులు ఇళ్లకు చేరుకునే సమయం కావడంతో ఇబ్బందులు పడ్డారు. జిల్లాలో అనపర్తిలో 12.4 మి.మీ, రాజమహేంద్రవరంలో 5 మి.మీ, రూరల్‌లో 4.6 మి.మీ, పెరవలి 3.8 మి.మీ, ఉండ్రాజవరం 3.0 మి. మీ, బిక్కవోలు 1.2 మి.మీ, కడియం 1.2 మి.మీ, వర్షం కురిసింది. రాగల నాలుగు రోజులు పాటు ఒక మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలిపింది.



సోమవారం సాయంత్రం రాజమండ్రిలో కురస్తున్న వాన

వర్షపు నీరు రోడ్లపై నిలవకూడదు : కలెక్టర్

రాజమహేంద్రవరం సిటీ, జూలై 21(ఆంధ్రజ్యోతి): వర్షపు నీరు రోడ్డుపై నిలవకుండా నిర్మించబోతున్న స్ట్రామ్ వాటర్ డ్రెయిన్ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్, నగర పాలక సంస్థ ఇన్‌చార్జి కమిషనర్ పి.ప్రశాంతి సూచించారు. రాజమహేంద్రవరం వీరభద్రపురంలో జరుగుతున్న పనులను సోమవారం కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇంజనీరింగ్ అధికారులతో పనుల పురోగతిపై సమీక్షించారు. వీరభద్రపురం హనుమాన్ ఆలయం నుంచి సీతంపేట పబ్లిక్ టాయిలెట్స్ మీదుగా కృష్ణనగర్ ప్రగతి ఫర్నిచర్ వరకు రూ.1.95 కోట్లతో చేపడుతున్న స్ట్రామ్ వాటర్ డ్రెయిన్ నిర్మాణ పనుల వివరాలు కలెక్టర్‌కు అధికారులు వివరించారు. పనులు వెంటనే పూర్తి చేసి ప్రారంభించాలని అధికారులను ఆదేశించారు. నగరంలో ఎక్కడా వర్షపు నీరు రోడ్లపై నిలిచే పరిస్థితి ఉండకూడదని సూచించారు.ఆమె వెంట ఎస్ఈ కోటేశ్వరరావు ఉన్నారు.



జ..గన్.. మిథున్..!

బాస్ కోసం జిల్లాలో బరితెగింపు

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

వైసీపీ ఎంపీ మిథున్‌రెడ్డి అరాచకాలు, అక్రమాలకు, దందాలకు లెక్కేలేదు. వైసీపీ ఐదేళ్ల పాలనలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా కోఆర్డినేటర్‌గా అధికారం చెలాయించారు. వంతాడ మైనింగ్‌పై కన్నేసి లీజుదారులను బెదిరించి వాటాలు కొట్టేశారు. అప్పటి సీఎం జగన్ భారతి సిమెంట్ కంపెనీకి ఇక్కడి నుంచి రిజర్వ్ ఫారెస్ట్‌ను తప్పేసి మరీ లేటరైట్ పంపించారు. జగన్ కోసం కాకినాడ పోర్ట్స్,కాకినాడ సెజ్ యజమానులను బెదిరించి వాటాలను అరబిందో కంపెనీకి రాయించడం కోసం ఏకంగా బెదిరింపులకు దిగారు. వందలకోట్ల పేదల ఇళ్ల స్థలాల చదునులో కాకినాడ సిటీ మాజీ ఎమ్మెల్యే ద్వారంపూడితో కలిపి కోట్లకు కోట్లు కొట్టేశారు. గతేడాది జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో మద్యం కుంభకోణంలో సంపాదించిన అక్రమ సొమ్మునే ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో నియోజకవర్గాలకు తరలించి టీడీపీని ఓడించడానికి మిథున్‌రెడ్డి స్కెచ్ అమలుచేశారు. అప్పటి సీఎం జగన్ అండదండలతో ఉమ్మడి జిల్లాలో మిథున్ రెడ్డి రెచ్చిపోయారు. రూ.3,200 కోట్ల మద్యం కుంభకోణంలో కీలక సూత్రధారిగా అరెస్టయి రాజమహేంద్రవరం సెంట్రల్ జైల్లో ఉన్నారు.

బెదిరించి..వాటాలు కొట్టేసి..

కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండలం వంతాడ కొండల్లో లేటరైట్ సిమెంట్ తయారీ, అల్యూమినియం ఉత్పత్తికి ఆధారం. పశ్చిమ గోదావరి జిల్లాకు చెందిన ఆంధ్రు శ్రీనివాస్ 2013లో వంతాడ కొండపై 20 ఏళ్ల పాటు 200 ఎకరాల్లో లీజులు దక్కించుకున్నారు. 41.25 లక్షల మెట్రిక్ టన్నుల లేటరైట్ గనులపై జగన్ ఆదేశాలతో మిథున్‌రెడ్డి కన్నేశారు. లీజుదారుడిని బెదిరించి బలవంతంగా డీల్ కుదిర్చారు. దీని ద్వారా ఏడాదికి అప్పటి ప్రభుత్వ పెద్దలు రూ.180 కోట్లు వెనకేసుకున్నారు.

రిజర్వ్ ఫారెస్ట్ తప్పించేశారు...

విశాఖ జిల్లా నాతవరం మండలం బమిడికిలొద్దు వద్ద లేటరైట్ కొండలపై జగన్ కన్ను పడింది. లీజుదారుడిని దారికితెచ్చుకుని మిథున్‌రెడ్డి వాలిపోయారు. తవ్విన లేటరైట్‌ను జాతీయరహదారి మీదుగా కడపలోని సిమెంట్ ఫ్యాక్టరీకి తరలించే దగ్గర చిక్కొచ్చింది. దీంతో మిథున్‌రెడ్డి పెద్ద స్కెచ్ వేశారు. బమిడికలొద్దు లేటరైట్ క్వారీకి అతి సమీపంలో రౌతులపూడి ఉండడంతో క్వారీ నుంచి జల్దాం వరకు రహదారిని నిర్మించి అక్కడి నుంచి కత్తిపూడి హైవే మీదుగా కడపకు లేటరైట్ తరలింపునకు స్కెచ్ వేశారు. ఈ మేరకు చెల్లూరు-బమిడికలొద్దు మధ్య ఉన్న ఐదు కిలోమీటర్ల పరిధిలో ఉన్న రిజర్వ్‌ఫారెస్ట్‌ను అటవీశాఖ అనుమతుల్లేకుండా తప్పించేశారు. ఇక్కడి నుంచి కడపలో భారతి సిమెంట్‌కు లేటరైట్ తరలించేశారు.

ఉమ్మడి జిల్లాతో మిథున్‌రెడ్డికి సంబంధం?

వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత 2022లో కడప జిల్లా రాజంపేట ఎంపీగా ఉన్న పీవీ మిథున్‌రెడ్డిని అప్పటి సీఎం జగన్ ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా కోఆర్డినేటర్‌గా నియమించారు. అప్పటి నుంచీ మిథున్‌రెడ్డి జిల్లాలో చెలరేగిపోయారు. జగన్ మెప్పుకోసం.. జగన్ ఆర్థిక ప్రయోజనాల కోసం అడ్డంగా బరితెగించేశారు. కలెక్టర్లు, ఎస్పీలుగా ఎవరుండాలో ఆయనే డిసైడ్ చేసేవారు. అయితే అప్పటికే జగన్ ప్రభుత్వం తెచ్చిన మద్యం పాలసీలో మిథున్‌రెడ్డి కీలకంగా మారారు. మద్యం ముడుపులు ఎక్కడి నుంచి ఎక్కడికి వెళ్లాలి? ఏ బ్రాండ్‌లను అనుమతించాలి? వంటివన్నీ మిథున్‌రెడ్డి చక్కబెట్టారు. పెద్దాపురం మండలం చినబ్రహ్మదేవంలోని కేబీకే బయోటెక్ నుంచి స్పిరిట్ కొనుగోలులోనూ చక్రం తిప్పినట్టు సమాచారం. ప్రభుత్వం మారాక గతేడాది మద్యం కుంభకోణానికి సంబంధించి సీఐడీ జరిపిన సోదాల్లో చినబ్రహ్మదేవంలోని కేబీకే బయోటెక్ కంపెనీ కూడా ఉంది. డిస్టిలరీల లెక్కలు, కేబీకే నుంచి వెళ్లిన సరుకు లెక్కల్లో వ్యత్యాసాలపై ఆరా తీసింది. తాజాగా ఈ కుంభకోణంలో మిథున్‌రెడ్డి పాత్ర బయటపడడంతో అరెస్టయి రాజమండ్రి సెంట్రల్ జైలుపాలయ్యారు.



సెంట్రల్ జైలులో ఎంపీ మిథున్‌రెడ్డి

లిక్కర్‌స్కామ్‌లో ఏ4, వైసీపీ ఎంపీ పెదిరెడ్డి వెంకట మిథున్‌రెడ్డికి రాజమహేంద్రవరం సెంట్రల్ జైలులో రిమాండ్ ఖైదీ నంబర్ 4196 కేటాయించారు. సెంట్రల్ సూపరింటెండెంట్ రాహుల్ కథనం ప్రకారం. ఆదివారం రాత్రి 8.50 గంటలకు నిందితుడిని జైలులోకి తీసుకున్నారు. అతన్ని స్నేహ బ్లాక్ బ్యారక్‌లో ఉంచారు.

- కన్నేస్తే ఖాళీ కావాల్సిందే
- నాడు ఉమ్మడి జిల్లా కోఆర్డినేటర్
- ఐదేళ్లూ దందాలు.. దౌర్జన్యాలే
- ఎన్నికల్లో మద్యం, డబ్బు డంపింగ్
- నకిలీ మద్యం నిల్వలు
- లేటరైట్.. అక్రమాలు
- పేదల ఇళ్ల స్థలాల చదును
- కేబీకే బయోటెక్‌లో హస్తం
- లిక్కర్ స్కాంలో జైలుపాలు
- మిథున్‌రెడ్డి అరాచకాలెన్నెన్నో..

ఎన్నికల్లో.. డబ్బు..మందు...

ఉమ్మడి జిల్లా కోఆర్డినేటర్ హోదాలో మిథున్‌రెడ్డి గత ఎన్నికల్లో టీడీపీని ఓడించడానికి మద్యం, అక్రమ సొమ్ము వందల కోట్లలో ఇక్కడ డంప్ చేశారు. ఈమేరకు అప్పటి ఎమ్మెల్యే ద్వారంపూడితో స్కెచ్ వేశారు. పిఠాపురంలో పవన్‌ను ఓడించడానికి మిథున్‌రెడ్డి కొన్ని రోజులు జిల్లాలోనే మకాం వేశారు. కడప నుంచి నకిలీ మద్యాన్ని వ్యాన్లలో తరలించారు. ఒక్క పిఠాపురానికి కోట్లలో నకిలీ మద్యం డంప్ చేశారు. పోటీ తీవ్రంగా ఉన్న నియోజకవర్గాలకు రూ.30 కోట్లు, కోట్ల విలువైన మద్యం మిథున్‌రెడ్డి కనుసన్నల్లోనే పంపిణీ జరిగింది. ఈ మందు పలుచోట్ల జిల్లాల్లో పట్టుబడింది. ఈ బాటిళ్లు అత్యంత నాసిరకంగా తేల్చారు.

సెజ్‌లు..పోర్టు..

పదివేల ఎకరాల విస్తీర్ణంలో ఉన్న కాకినాడ సెజ్ దేశంలోనే పెద్దది. ఇందులో 51 శాతం జీఎమ్మార్, కాకినాడ డీప్ వాటర్‌పోర్టు నిర్వహణదారుడైన కేవీరావుకు 0.29 శాతం, ఆయనకే చెందిన కాకినాడ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ హోల్డింగ్స్ ప్రైవేట్ లిమిటెడ్(కేఐహెచ్‌పీఎల్)కు 33.75 శాతం వాటాలున్నాయి. వీటన్నింటిపై జగన్ కన్నేయగా, మిథున్‌రెడ్డి రంగంలోకి దిగి వైవీ.విక్రాంత్‌రెడ్డితో కలిపి స్కెచ్ వేశారు. కేవీ రావును బెదిరించి వాటా రాయించేసుకున్నారు. కాకినాడ సీపోర్టు (డీప్‌వాటర్‌పోర్టు)పైనా జగన్ కన్నేయడంతో మిథున్‌రెడ్డి బెదిరించి 41.12శాతం వాటాను కేవీ రావు జగన్ చెప్పిన అరబిందోకు విక్రయించారు.


బిక్కవోలు పీజీఆర్‌ఎస్‌లో సమస్యలు వింటున్న కలెక్టర్ ప్రశాంతి

సమస్యల పరిష్కారానికే పీజీఆర్‌ఎస్

బిక్కవోలులో కలెక్టర్ ప్రశాంతి

బిక్కవోలు, జూలై 21(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రజా సమస్యల సత్వర పరిష్కారానికి పీజీఆర్‌ఎస్ ఎంతగానో దోహదపడుతుందని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. బిక్కవోలు మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన పీజీఆర్‌ఎస్‌కు కలెక్టర్ హాజరయ్యారు. ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. సావధానంగా సమస్యలు విన్నారు. 21 మంది తమ సమస్యలు పరిష్కరించాలంటూ వినతిపత్రాలు కలెక్టర్‌కు అందజేశారు. వీటిలో 4 ఇతర మండలాల నుంచి, 5 రెవెన్యూ, మిగిలిన 13 ఇతర సమస్యలకు సంబంధించినవి ఉన్నాయి. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ మండల పరిధిలో ప్రజల్లో చైతన్యం కలిగించేందుకే పీజీఆర్‌ఎస్‌కు వచ్చానన్నారు. ప్రజలు మరింత సమర్థవంతమైన పౌరసేవలకు 95523 00009 వాట్సాప్ గవర్నెన్స్, పీజీఆర్‌ఎస్ పరిష్కార స్థాయి కోసం 1100 నెంబర్లకు డయల్ చేయాలన్నారు. అనంతరం భూముల రీసర్వేలో చాలా అవకతవకలు జరిగాయని వాటిని సరిచేయాలంటూ కూటమి నేతలు కలెక్టర్‌ను కోరారు. రీసర్వేలో తక్కువ భూములు వచ్చిన వారు ఎన్నిసార్లు తహశీల్దార్ కార్యాలయం చుట్టూ తిరిగినా సరిచేయడం లేదని, ఎక్కువ భూమి వచ్చిన వారు సంతకం చేస్తే సరిచేస్తామనడం ఎంత వరకూ సమంజసమని ప్రశ్నించారు. ఆన్‌లైన్‌లో అయినా సరిచేయాలన్నారు. దీంతో కలెక్టర్ రికార్డులు చూసి సరిచేయాలని తహశీల్దార్ కృష్ణకు సూచించారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉండగా గత తహశీల్దార్ దొంగ చాటుగా 220 ఇళ్ల పట్టాలు ఇచ్చారని వాటిని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. దీనిపై నివేదిక పంపాలని తహశీల్దార్‌కు సూచించారు. ఆమె వెంట జేసీ ఎస్.చిన్నరాముడు, డీఆర్‌డీఏ పీడీ ఎన్‌వీవీఎస్. మూర్తి, డీపీవో వి. శాంతామణి, డీఎంహెచ్‌వో డా. కె. వెంకటేశ్వరరావు, డీసీహెచ్‌ఎస్ పద్మ, ఎంపీపీ తేతలి సుమ, సర్పంచ్ సరెళ్ల సుమలత, ఎంపీడీవో వి. శ్రీనివాస్, కూటమి నేతలు కొవ్వూరి వేణుగోపాలరెడ్డి,పాలచర్ల శివప్రసాద్‌చౌదరి, చింతా శ్రీనివాసరెడ్డి, నల్లమిల్లి సుబ్బారెడ్డి, గొర్రెల త్రిమూర్తులు తదితరులు పాల్గొన్నారు.

పీజీఆర్‌ఎస్‌కు 234 అర్జీలు

రాజమహేంద్రవరం రూరల్, జూలై 21 (ఆంధ్రజ్యోతి): ప్రజల సమస్యల పరిష్కారం కోసం ప్రతి సోమవారం నిర్వహించే పీజీఆర్‌ఎస్‌లో భాగంగా జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన మీకోసంలో 234 అర్జీలు ప్రజల నుంచి వచ్చాయని డీఆర్‌వో టి.సీతారామ్మూర్తి తెలిపారు. కలెక్టరేట్‌లో సోమవారం ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు.పౌరసేవలపై అధికారుల జవాబుదారీతనం కలిగి ఉండాలన్నారు. పీజీఆర్‌ఎస్‌లో రెవెన్యూ శాఖ 101 అర్జీలు, పంచాయితీరాజ్ 39, పోలీస్ 22, విద్యుత్ శాఖ 12, ఇతర శాఖలు 58 అర్జీలు స్వీకరించినట్లు డీఆర్‌వో తెలిపారు.కార్యక్రమంలో స్పెషల్ కలెక్టర్లు ప్రేమ్ కుమార్, భాగ్యలక్ష్మి, సీపీవో ఎల్ అప్పలకొండ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

డీపీవోలో గ్రీవెన్స్‌కి 27 అర్జీలు

రాజమహేంద్రవరం, జూలై 21 (ఆంధ్రజ్యోతి): జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం పబ్లిక్ గ్రీవెన్స్ నిర్వహించారు. అడిషనల్ ఎస్పీలు ఎన్‌బీఎం మురళీకృష్ణ, ఏవీ సుబ్బరాజు ప్రజల నుంచి 27 ఫిర్యాదులను స్వీకరించారు. తదుపరి చర్యల నిమిత్తం సంబంధిత అధికారులకు పంపించారు.


భీమోలులో అసైన్డ్ భూములు పరిశీలిస్తున్న స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఎస్.భాస్కర్‌రెడ్డి

సర్వే నెంబర్లు మార్చి ఆన్‌లైన్ చేస్తే చర్యలు

స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ భాస్కర్‌రెడ్డి

గోపాలపురం, జూలై 21 (ఆంధ్రజ్యోతి): వివాదాస్పద భూములకు సర్వే నెంబర్లు మార్చి ఆన్‌లైన్ చేస్తే చర్యలు తప్పవని స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఎస్.భాస్కర్‌రెడ్డి హెచ్చరించారు. సర్వే నెంబర్ మార్చి తనకు భూమి ఆన్‌లైన్ చేశారని నరసింహారెడ్డి ఇటీవల కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన కలెక్టర్ పి.ప్రశాంతి క్షేత్రస్థాయి విచారణ చేట్టాలని ఆదేశించారు. ఈ మేరకు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ భాస్కర్‌రెడ్డి విచారణ చేపట్టి మాట్లాడారు.సర్వే నెంబర్ 558/1ఏలో భీమోలుకు చెందిన కొంత మంది వ్యక్తులకు భూమివ్వడం జరిగిందన్నారు. అదే సర్వే నెంబర్ పేరుతో వేరే ప్రదేశంలో వివాదంలో ఉన్న భూమిని నరసింహారెడ్డి పేరున ఆన్‌లైన్ చేశారని కలెక్టర్‌కు ఫిర్యాదు అందిందన్నారు. దీనిపై క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టగా విచా రణలో అవకతవకలు జరిగినట్టు నిర్ధారణ అయ్యిందన్నారు. రెండు చోట్ల ఉన్నభూము లను రెవెన్యూ అధికారులతో కలిసి స్వయంగా పరిశీలించామన్నారు. దీనిపై సమగ్ర నివేదిక తయారు చేసి తనకు అందజేయాలని తహశీల్దార్ అజయ్ బాబుకు ఆదేశించారు.అనంతరం నివేదికను కలెక్టర్‌కు సమర్పిస్తామన్నారు.ఆయన వెంట ఆర్ఐ సునీత, సర్వేయర్ సత్యానా రాయణ, వీఆర్వో గోతియ్య, విలేజ్ సర్వేయర్ ఇమ్రాన్, ఫిర్యా దుదారుడు నరసింహారెడ్డి ఉన్నారు.

వైద్యో..నారాయణో హరి..హరీ!

పెద్దాసుపత్రికి వస్తే చింతే

రాజమహేంద్రవరం ప్రభుత్వాస్పత్రిలోని అత్యవసర చికిత్స విభాగానికి అత్యవసర చికిత్స తక్షణ అవసరంగా కనిపిస్తోంది. గుప్పెట్లో ప్రాణాలు పెట్టుకొని వస్తున్న బాధితులకు నిర్లక్ష్యం ఆహ్వానం పలుకుతోంది. గోల్డెన్ మినిట్స్‌ని వృథా చేస్తూ యథాలాపంగా విధులు నిర్వహిస్తుండడం బాధితులకు కన్నీటిని మిగులుస్తోంది. జిల్లా ఆస్పత్రి కావడంతో అత్యవసరంగా ఒక వ్యక్తిని ఆస్పత్రి వరకూ తీసుకొచ్చినా చికిత్స లోపలకు తీసుకెళ్లే వారు కానరావడంలేదు. స్ట్రెచర్, వీల్ చైర్ కోసం వెతుకులాట తప్పదు. దీంతో క్షతగాత్రులు రక్తం కారుతూ, బాధను ఓర్చుకుంటూ ఆటోలో, అంబులెన్సులో అప్పటి వరకూ ఉండాల్సిందే. స్ట్రెచర్‌ని బాధితులు వెతికి తెచ్చుకొని దానిపై క్షతగాత్రుని ఎక్కించడానికి నానా యాతన పడుతున్నారు. తీరా లోపలకు తీసుకెళ్లిన తర్వాత కూడా సిబ్బందిలో తాపత్రయం కనబడడం లేదు. కసురుకోవడం, విసుక్కోవడం ఎక్కువైపోయింది. ఒకవేళ ప్రాణం గుటుక్కుమంటే సీఎంవో గది బయటే స్ట్రెచర్‌పై గంటల తరబడి ఆ మృతదేహాన్ని వదిలేస్తున్నారు. ఇటువంటి ఘటనలు జిల్లా ఆసుపత్రిలో నిత్యకృత్యంగా మారాయి. వాస్తవానికి 2022 డిసెంబరు 21న డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ అండ్ కమిషనర్ ఆఫ్ ఏపీవీవీపీ ఆదేశాల ప్రకారం అత్యవసర చికిత్స కోసం వచ్చే వారిని క్యాజువాలిటీకి తీసుకెళ్లడానికి ద్వారం వద్ద 2 స్ట్రెచర్లు, 2 వీల్ చైర్లు, ఒక్కొక్కరు చొప్పున ఎంఎన్‌వో, ఎఫ్ఎన్‌వో, వైద్యుడును (సీఎఎస్-జనరల్/జీడీఎంవో/హౌస్ సర్జన్‌లకు ప్రాధాన్యం ఇవ్వాలి) నిరంతరం అందుబాటులో ఉంచాలి.కానీ ఇక్కడ స్ట్రెచర్ కూడా కానరాదు.






ఈ ఫొటోలు చూస్తే ప్రభుత్వాస్పత్రిలోని అత్యవసర విభాగం అలసత్వం అర్థమవుతుంది. ఓ దివ్యాంగురాలు ఆస్పత్రి వరకూ ఆటోలో వచ్చి అక్కడి నుంచి లోపలికి వెళ్లే వీల్ చైర్ లేక గంటల తరబడి అలాగే ఉండిపోయింది. మరొక మహిళను ఆస్పత్రికి అత్యవసర చికిత్సకు తీసుకొచ్చి స్ట్రెచర్‌పై ఇబ్బందులు పడుతూ తీసుకెళ్లారు. ఈ దుస్థితి ఇక్కడ నిత్యకృత్యంగా మారిపోయింది. అర్ధరాత్రి వేళలో వస్తే వైద్యో నారాయణో హరి..హరీయే!

(రాజమహేంద్రవరం - ఆంధ్రజ్యోతి)

టీచర్ల కేడర్ స్ట్రెంగ్త్ సమస్య పరిష్కరించాలి

యూటీఎఫ్ నాయకుల డిమాండ్

రాజమహేంద్రవరం అర్బన్, జూలై 21 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలోని ఉపాధ్యాయుల కేడర్ స్ట్రెంగ్త్ సమస్యను ఉన్నతాధికారులు వెంటనే పరిష్కరించి, బదిలీ అయిన ఉపాధ్యాయులకు రెండు నెలల జీతాలు చెల్లించాలని యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పి.జయకర్, ఏ. షరీఫ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం రాజమహేంద్రవరంలోని జిల్లా కార్యాలయంలో జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో వారు మాట్లాడారు. టీచర్ల బదిలీలు జరిగి ఇప్పటికి రెండు నెలలు పూర్తవుతున్నా బదిలీ అయిన ఉపాధ్యాయుల కేడర్ స్ట్రెంగ్త్ సమస్య పరిష్కారం కాలేదన్నారు. రాష్ట్ర కార్యదర్శి ఎన్.అరుణకుమారి మాట్లాడుతూ గత పీఆర్‌సీ బకాయిలతో పాటు ఉద్యోగులకు పెండింగ్‌లో ఉన్న నాలుగు డీఏలు, 2021 నుంచి బకాయిన్న ఏపీజీఎల్ఐ బకాయిలు చెల్లించాలని కోరారు.ఈ కార్యక్రమంలో జిల్లా కోశాధికారి ఈవీఎస్ఆర్ ప్రసాద్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రూపస్, జిల్లా కార్యదర్శులు రమేష్‌బాబు, పి.శ్రీనివాసమూర్తి, కే.నాగభూషణం, చిలుకూరి శ్రీనివాస్, కేవీఎస్‌ప్రకాష్‌రావు పాల్గొన్నారు.

ఏం చెప్పమంటారు.. బాస్!

- ఎస్పీ సీరియస్‌తో గుబులు
- హైవే పెట్రోలింగ్‌లో హైరానా
- ఇప్పటి వరకూ 3 కేసులు.. 6 కాసులు
- ఎటూ చెప్పలేక అయోమయం

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

బాస్‌లు ఏం చెబితే అది చేయాలి.. కాదంటే కుదురుతుందా.. చేయమంటే తప్పుతుందా.. ప్రస్తుతం ఒక వర్గం పోలీసుల పరిస్థితి అడకత్తెరలో పోకచెక్కలా ఉంది. ఎందుకంటే బాస్‌లు ముడుపులు పుచ్చుకొని విధుల్లో కళ్లు మూసుకుంటుంటే.. ఉన్నత బాసులు తమను నిందిస్తుండంపై జిల్లా పోలీసుల్లోని ఓ విభాగం వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లా పోలీసు శాఖలో హైవే పెట్రోలింగ్ విభాగం ఉంది.జిల్లాలోని గోపాలపురం, కొవ్వూరు రూరల్, దేవరపల్లి, త్రీ టౌన్, ప్రకాశంనగర్, రాజానగరం, బొమ్మూరు స్టేషన్లకు హైవే పరిధి ఉంది. వీటిలో బొమ్మూరు, రాజానగరం, దేవరపల్లి స్టేషన్లు కీలకం. హైవేలోని ప్రమాదాలు ఎక్కువగా జరుగుతుండడంతో..వాటి నివారణకు ముందస్తు భద్రత చర్యల్లో భాగంగా హైవే మొబైల్ టీంలను ఏర్పాటు చేశారు. జిల్లాలో మూడు హైవే మొబైల్, మూడు రోడ్ సేఫ్టీ మొబైల్ టీంలు ఉన్నాయి. ప్రతి టీంకి ఒక జీపు, ప్రమాద సమయంలో కావాల్సిన సరంజామా, ఒక హెడ్ కానిస్టే బుల్/ఎఎస్ఐ, ఒక డ్రైవరు ఉంటారు.ఈ టీంలు నిరంతరాయంగా హైవేలో తిరుగుతూ గమనిస్తుండాలి. హైవేలపై నిబంధనలకు విరుద్ధంగా నిలిపిన లారీలు, వ్యాన్లను తీయించడం, ప్రమాదాలు జరిగిన సమయంలో క్షతగాత్రులను వెంటనే ఆస్పత్రులకు తరలించడం తదితర విధులు నిర్వర్తిస్తారు. రాత్రి వేళల్లో హైవేకు దగ్గరగా ఉన్న దాబాలు,హోటళ్లు, మద్యం దుకాణాలను మూత వేయించడం కూడా రోజూ చేయాలి.రాత్రి వేళల్లో ఆవుల రవాణా తదితర అక్రమ దందా వాహనాల ద్వారా బాగానే ముడుతుందనేది బహిరంగ రహస్యం.దీంతో హైవే పెట్రోలింగ్ వాహనాల్లో డ్యూటీ కోసం కొందరు కాచుకొని కూర్చుంటారు. ఇలా హైవే పెట్రోలింగ్ అసలు పనిని కాలానికి వదిలేసి..మూడు లారీలు, ఆరు కాసులు అనే చందంగా సాగిపోతోంది.అయితే ఇటీవల జాతీయ రహదారిపై ఎక్కడ పడితే అక్కడ భారీ లారీలు సైతం నిలిపివేస్తుండడం,దాబాలు,హోటళ్లు తెల్లార్లూ తెరిచే ఉండ డాన్ని జిల్లా బాస్ గుర్తించి కన్నెర్ర చేశారు. ఏంటీ అలసత్వం అంటూ గట్టిగా ప్రశ్నించారు. మొబైల్ టీంలలో తడుములాట మొదలైంది.హైవేపై దాబాలు, హో టళ్ల వాళ్లు ఆయా స్టేషన్లకు నెలవారీ మొక్కులు చెల్లిం చుకుంటూ ఉంటారు.దీంతో సమయం మించినా, ఏదైనా చిన్నపాటి గొడవలు జరిగినా చూసీ చూడకుండా వదిలే స్తుంటారు. దాబాల్లో అనధికార బార్లూ నడుస్తున్నాయని సమాచారం. తమ పైవారు మొత్తాలు పుచ్చుకోవడంతో తమ మాట వినడం లేదని, దుకాణం వద్దకు సైరన్‌తో జీపు వెళ్లినా, తాము హెచ్చరించినా లెక్క చేయడం లేదని జిల్లా బాస్‌కు ఎలా చెప్పాలని ఎదురు ప్రశ్నవేస్తున్నారు.కొందరు అక్కడి నుంచే తమ సీఐలతో మాట్లాడుతుంటారని,అప్పుడు తాము జారుకోవడం తప్ప చేసేదేమీ ఉండడం లేదని వాపోతున్నారు.



'అంగన్‌వాడీల ఫేస్ యాప్‌ను తక్షణమే రద్దుచేయాలి'



సీడీపీవో నాగలక్ష్మికి వినతిపత్రం అందజేస్తున్న అంగన్‌వాడీలు

కొవ్వూరు, జూలై 21 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీల కోసం ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఫేస్ యాప్‌ను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం ఐసీడీఎస్ కార్యాలయం వద్ద ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ మేరకు ఆ యూనియన్ నేతలంతా కలిసి సీడీపీవో కే.నాగలక్ష్మికి వినతిపత్రం అందజేశారు. జిల్లా అధ్యక్షురాలు సీహెచ్ మాణిక్యాంబ మాట్లాడుతూ అంగన్ వాడీ సెంటర్ల లో గర్భిణులు, పిల్లలకు పౌష్టికాహారం అందాలంటే ఫేస్ యాప్‌లో ఫొటో తప్పనిసరి చేయడంతో తీవ్రఇబ్బందులు పడుతున్నారన్నారు. అలాగే కేంద్రం నిర్వహణకు ఒకే యాప్‌ను రూపొందించాలన్నారు. కార్యక్రమంలో వసంత కుమారి, శ్రీదేవి, గౌతమి, అమరావతి, సుజాత, భాస్కరమ్మ, విజయకుమారి పాల్గొన్నారు.

డివిజనల్ పీజీఆర్‌ఎస్‌కు 17 ఫిర్యాదులు



ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఆర్డీవో రాణీసుస్మిత

కొవ్వూరు, జూలై 21 (ఆంధ్రజ్యోతి) : ప్రతి సోమవారం నిర్వహిస్తున్న డివిజనల్ పీజీఆర్‌ఎస్‌కు 19 ఫిర్యాదులు అందినట్టు ఆర్డీవో డా. రాణీసుస్మిత తెలిపారు. సోమవారం కొవ్వూరు ఆర్డీవో కార్యాలయంలో డివిజనల్ పీజీఆర్‌ఎస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి జనాలు వచ్చారు. ఆర్డీవో మాట్లాడుతూ స్వీకరించిన ఫిర్యాదులను ఆయా శాఖల అధికారులకు పంపించి సత్వరం పరిష్కారం అయ్యేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో డివిజనల్, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

కోట సత్తెమ్మ నిత్యాన్నదాన ట్రస్టుకు విరాళం



రవిశంకర్‌కు నగదు అందిస్తున్న దాత రామ కోటేశ్వరరావు

నిడదవోలు, జూలై 21 (ఆంధ్రజ్యోతి): తిమ్మరాజుపాలెంలో వేంచేసి వున్న కోట సత్తెమ్మ వారి దేవస్థానంలో సోమవారం చాగల్లు మండలం మార్కొండపాడుకి చెందిన దాత ఈదర రామ కోటేశ్వరరావు తన భార్య గంగా భవాని జ్ఞాపకార్థం అమ్మవారి నిత్యాన్నదాన ట్రస్టుకు రూ. 1,28,000 విరాళాన్ని ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్ దేవులపల్లి రవిశంకర్‌కు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకుడు ఎస్‌వీకేపీ శర్మ, ఆలయ సూపరింటెండెంట్ పి.శ్రీనివాసరావు, ఎల్. నారాయణ, ఆలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

చెత్త తొలగింపు



కాలువలో చెత్తను తొలగిస్తున్న దృశ్యం

నిడదవోలు, జూలై 21 (ఆంధ్రజ్యోతి): శింగవరం శివారులో ఉన్న పంట పొలాలు మురుగుతో నీట మునిగి రైతాంగం ఇబ్బందులు పడుతుండడంతో సోమవారం అధికారులు స్పందించారు. తిమ్మరాజుపాలెం శివారులో ఉన్న మురుగునీటి కాలువలో నిండుకున్న చెత్తాచెదారాలను పొక్లెయిన్‌తో తొలగించే పనులు ప్రారంభించారు. దీనిపై గ్రామానికి చెందిన చెరుకు శ్రీను అధికారుల దృష్టికి తీసుకువెళ్లడంతో అధికార యంత్రాంగం చర్యలు చేపట్టింది. కార్యక్రమంలో నీటిపారుదల శాఖాధికారులు, వ్యవసాయ శాఖ, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

పథకాలపై అవగాహన అవసరం

ఉండ్రాజవరం, జూలై 21 (ఆంధ్రజ్యోతి): డ్వాక్రా సభ్యులు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన కలిగి ఉండాలని తహశీల్దార్ పీఎన్‌డీ ప్రసాద్ పేర్కొన్నారు. సోమవారం స్థానిక వెలుగు కార్యాలయంలో గ్రామ సమృద్ధి స్థాపక ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా డ్వాక్రా సంఘాల అధ్యక్షులు, సంఘ సహాయకులకు ఒక్క రోజు శిక్షణ కార్యక్రమంలో పాల్గొని ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో ఎంపీడీవో వీఎస్ రామారావు, ఈవోపీఆర్డీ కె.ఆంజనేయశర్మ, ఏపీఎం టి. బాలకోటయ్య, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రాభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం : ఎమ్మెల్యే



మద్దూరులో ప్రజలకు పథకాల గురించి వివరిస్తున్న ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు

కొవ్వూరు, జూలై 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రాభివృద్ధే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. మద్దూరులో సోమవారం సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. వర్షంలోనూ గొడుగులు వేసుకుని ఇంటింటికీ తిరిగి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రాష్ట్రప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాల గురించి వారికి వివరించారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. తల్లికి వందనం, ఉచిత గ్యాస్ సిలిండర్, ఇంటివద్దకే పింఛన్ల పంపిణీ గురించి వివరించారు. ద్విసభ్య కమిటీ సభ్యులు కంట మణి రామకృష్ణారావు, జొన్నలగడ్డ సుబ్బరాయ చౌదరి, ఎంపీపీ కాకర్ల నారాయుడు, సర్పంచ్ ఉప్పులూరి రాజేంద్ర మునిప్రసాద్, నాయుడు వీర్రాజు, గ్రామస్థులు, తదితరులు పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ

పేద ప్రజల ఆరోగ్యానికి కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యతనిస్తోందని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. సోమవారం పశివేదల గ్రామానికి చెందిన ఇద్దరికి, అలాగే నియోజవర్గ వ్యాప్తంగా ఎనిమిది మందికి మంజూరైన రూ. 3,24,587 లక్షల చెక్కులను ఎమ్మెల్యే లబ్ధిదారులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ద్విసభ్య కమిటీ సభ్యులు కంట మణి రామకృష్ణారావు, జొన్నలగడ్డ సుబ్బరాయ చౌదరి, సొసైటీ అధ్యక్షుడు చావా శ్రీనివాస్, కే వీకే రంగారావు, ఎరుబండి వెంకట్రావు, తదితరులు పాల్గొన్నారు.

ఆరో రోజూ పారిశుధ్య కార్మికుల సమ్మె

కొవ్వూరు, జూలై 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఏకపక్ష నిర్ణయాలను వ్యతిరేకిస్తూ సోమవారం పట్టణంలోని బస్టాండ్ సెంటర్‌లో ఆరో రోజైన సోమవారమూ పారిశుధ్య కార్మికులు నిరవధిక సమ్మెను కొనసాగించారు. సీఐటీయూ జిల్లా నేత ఎం.సుందరబాబు మాట్లాడుతూ సమ్మె చేస్తున్న కార్మిక సంఘాల నేతలతో చర్చించకుండా రాష్ట్రప్రభుత్వం జీవో విడుదల చేయడాన్ని తప్పుబట్టారు. రాజాన అప్పారావు పాల్గొన్నారు.

ధూప, దీప, నైవేద్య పథకానికి ఐదు దేవాలయాలు : మంత్రి



మాట్లాడుతున్న మంత్రి దుర్గేష్

నిడదవోలు, జూలై 21 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో తక్కువ ఆదాయంతో ఉన్న ఐదు దేవాలయాలను ధూప దీప నైవేద్యం పథకం కింద ఎంపికయ్యాయని మంత్రి కందుల దుర్గేష్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో కంసాలిపాలెంలోని ఆలివేలు మంగా పద్మావతి సమేత వెంకటేశ్వర స్వామి దేవాలయం, సూరాపురంలోని వరసిద్ధి వినాయకస్వామి దేవాలయం, పెరవలి మండలంలోని తీపర్రులోని చింతాలమ్మ అమ్మవారి దేవాలయం, భ్రమరాంబ మల్లిఖార్జున స్వామి దేవాలయం, ఉండ్రాజవరం మండలం సత్యవాడలో ఉన్న ఉమారామలింగేశ్వరస్వామి ఆలయాలు ఉన్నాయన్నారు. వీటి నిర్వహణకు ప్రభుత్వం ప్రతి నెలా రూ. పది వేల ఆర్థిక సాయాన్ని అందిస్తుందన్నారు. వీటిలో రూ. ఏడు వేలు అర్చకుడికి, మూడు వేలు ధూప, దీప, నైవేద్యానికి వినియోగించాల్సి ఉంటుందన్నారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు నాయుడుకి, దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డికి మంత్రి దుర్గేష్ కృతజ్ఞతలు తెలిపారు.

ఏఎంసీ అభివృద్ధికి కృషి చేయాలి



శేషారావును సత్కరిస్తున్న దృశ్యం

ఉండ్రాజవరం, జూలై 21 (ఆంధ్రజ్యోతి): నిడదవోలు ఏఎంసీ ఛైర్మన్‌గా నియమితులైన చివటం గ్రామానికి చెందిన గాలింకి జిన్నా బాబు సోమవారం వేలివెన్నులో ఏపీ స్కిల్‌డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్, మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావును మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జిన్నాబాబును శేషారావు అభినందించారు. శేషారావు మాట్లాడుతూ ఏఎంసీ అభివృద్ధికి కృషి చేయాలన్నారు. మండల టీడీపీ అధ్యక్షుడు సింహాద్రి రామకృష్ణ, ఎంపీటీసీ సభ్యుడు వి. సత్యనారాయణ, మాజీ సర్పంచ్ దూలపల్లి జయరాజు, ఎం. పాండురంగారావు, పి. వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థికి నగదు అందజేత

తాళ్లపూడి, జూలై 21 (ఆంధ్రజ్యోతి): వేగేశ్వరపురం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 2023 సంవత్సరంలో 10వ తరగతి చదివిన పూర్వ విద్యార్థి సిద్దా మాధురికి ఐఐటీ ధనబాద్‌లో సీటు రావడంతో ఆమె చదువు నిమిత్తం పాఠశాల పూర్వ విద్యార్థులు ప్రొఫెసర్ కేవీ సుబ్బారావు, చీర్ల సత్యనారాయణ, మార్ని రామ్మూర్తి, లక్కిరాజు శారదాదేవి, సీర్ల బ్రహ్మానందం సేకరించిన రూ. 20 వేల నగదును సోమవారం ఎంఈవో బాలామణి చేతుల మీదుగా అందించారు. పూర్వ విద్యార్థి సంఘ సభ్యులు అడ్డాల డేవిడ్ రాజు, మారిశెట్టి సత్యనారాయణ, ఉపాధ్యాయులు దుర్గాప్రసాద్, సుభాషిణి, లక్ష్మణ్ పాల్గొన్నారు.

'సుపరిపాలనలో తొలిఅడుగు' నిర్వహణలో
గోపాలపురం ప్రథమస్థానం : మద్దిపాటి



గోపాలపురం, జూలై 21 (ఆంధ్రజ్యోతి): సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమాన్ని నిర్వహించడంలో గోపాలపురం నియోజకవర్గం జిల్లాలోనే ప్రథమ స్థానంలో నిలిచిందని ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు తెలిపారు. సోమవారం ఆయన గోపాలపురంలో విలేకరులతో మాట్లాడుతూ నియోజకవర్గంలోని 85 పంచాయతీల్లో ఇప్పటి వరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగిందన్నారు. దీనిలో భాగంగా ఆయాగ్రామాలకు అధ్యక్షుల్ని నియమించామన్నారు. జగన్నాథపురానికి పసుమర్తి గంగాధర్, వెంకటాయపాలెంకు దర్శికోటి మునేశ్వరరావు, చిట్యాలకు పెనుగొండ శ్రీనివాసరావు, వేలచింతలగూడెంకు ఇల్లూరి రాము, కరిచర్లగూడెంకు పటాన్ మగ్బుల్‌బాష, సగ్గొండకు మేని వెంకటరత్నాజీ, కొవ్వూరుపాడుకు చిలకా నరసింహ మూర్తి, చెరుకుమిల్లికి పడమట దుర్గారావు, గంగోలుకు మాండలిక నాగ వెంకట రమణమూర్తి, భీమోలుకు దాకవరపు అప్పారావు, గుడ్డిగూడెంకు గుదే సత్యనారాయణ, కరగపాడుకు కుచ్చు వెంకటేశ్వరరావు, దొండపూడికి ముత్యాల రాయుడు, వాదాలకుంటకు కాకర్ల శ్రీరామ్, రాజంపాలెంకు నందమూరి వీరవెంకట సత్యనారాయణ మూర్తి, కోమటిగుంటకు కొయ్యల మూడిబాల మురళి, సంజీవపురానికి చింతం కనకారావుదొర, గోపాలపురం టౌన్‌కు భూరెడ్డి శ్రీనివాస్ నియమితులయ్యారన్నారు. వీరితో పాటు ఆయా గ్రామ పంచాయతీలకు ఉపాధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులను కూడా నియమించామని ఎమ్మెల్యే తెలిపారు.

'చీపురుగూడెం' నిధుల దుర్వినియోగంపై విచారణ

నల్లజర్ల, జూలై 21 (ఆంధ్రజ్యోతి): చీపురుగూడెం పంచాయతీ నిధుల దుర్వినియోగమయ్యాయని, అజెండా వార్డు సభ్యులకు ఇవ్వకుండా వార్డు సభ్యులు కాని వారితో తీర్మానాల్లో సంతకాలు చేయించి నిధులు డ్రా చేసినట్టు అదే గ్రామానికి చెందిన పెనుమాక వెంకటరత్నం ఆరోపించాడు. ఈ మేరకు కలెక్టర్‌ను తగిన ఆధారాలతో ఫిర్యాదు చేశాడు. దీంతో సోమవారం డీఎల్‌పీవో వై.అమ్మాజీ, ఎంపీడీవో సింహాద్రిరావు చీపురుగూడెం వచ్చి అప్పటి కార్యదర్శులు మోషేరాజు, విజయలక్ష్మి, ఫిర్యాదుదారుడు వెంకటరత్నం, సర్పంచ్ గాలింకి మల్లిక సమక్షంలో రికార్డులను పరిశీలించారు. తీర్మానాలు, సర్వ సభ్య సమావేశం హాజరు రికార్డులను పరిశీలించడంతో కొన్ని చోట్ల వార్డు సభ్యులు కాని వారు సంతకాలు చేసినట్టు రుజువైయింది. దీనిపై విచారించేందుకు రికార్డులను ఆమె వెంట తీసుకుని వెళ్లారు. 2022 నుంచి 2024 వరకు జరిగిన పాలనలో వార్డు సభ్యులు సంతకాలు లేకుండా చేసి తీర్మానాల ద్వారా డ్రా చేసిన నిధులపై విచారించి సంబంధిత వ్యక్తులపై చర్యలు తీసు కుని, తిరిగి పంచాయతీ ఖాతాలో జమ చేయాలని ఫిర్యాదుదారుడు డీఎల్‌పీవోతో పేర్కొన్నారు. విచారణలో ఎంపీటీసీ రావూరి వెంకటరమణ, కూసంపూడి వెంకటేశ్వరరావు, గాలింకి రాంబాబు, ప్రత్తిపాటి రాంబాబు, మోదుగ సుబ్బారావు, కొరపాటి వెంకటరత్నం ఉన్నారు.

మిథున్‌రెడ్డి అరెస్టుపై కొవ్వొత్తుల ర్యాలీ



నిరసన ర్యాలీలో వైసీపీ నాయకులు

కొవ్వూరు, జూలై 21 (ఆంధ్రజ్యోతి): రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి అరెస్టుకు నిరసనగా కొవ్వూరు పట్టణంలో సోమవారం వైసీపీ శ్రేణులు కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించాయి. స్థానిక బస్టాండ్ సెంటర్‌లోని అంబేద్కర్ విగ్రహం వద్ద వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే తలారి వెంకట్రావు అధ్యక్షతన ఈ కార్యక్రమం జరిగింది.

దొమ్మేరు సొసైటీ రైతులకు వడ్డీ రాయితీ మంజూరు

కొవ్వూరు, జూలై 21(ఆంధ్రజ్యోతి): దొమ్మేరు ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘంలో 2022-23 సంవత్సరానికి సంబంధించి రైతులకు వడ్డీ రాయితీని ప్రభుత్వం మంజూరు చేసిందని సొసైటీ అధ్యక్షుడు గారపాటి రామకృష్ణ తెలియజేశారు. సొసైటీ పరిధిలోని రైతులు తీసుకున్న పంట రుణాలకు సంబంధించి 314 మందికి వారి ఖాతాల్లో రూ.6,23,091 వడ్డీ జమ చేసిందన్నారు. దీన్ని సొసైటీసభ్యులు, రైతులు సద్వినియోగం చేసుకోవాలని సొసైటీ కార్యదర్శి కే.ప్రసాద్ కోరారు.

బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శిగా శివనాగరాజు



నల్లజర్ల, జూలై 21 (ఆంధ్రజ్యోతి): అనంతపల్లికి చెందిన శెట్టిపల్లి శివనాగరాజు రెండోసారి బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఎంపికయ్యాడు. ఈయన గతంలో మండలా ధ్యక్షుడిగా, జిల్లా ఉపాధ్యక్షుడిగా, జిల్లా ప్రధాన కార్యదర్శిగా పని చేశారు. తిరిగి రెండోసారి అధిష్టానం అవకాశం కల్పించింది. ఈ సందర్భంగా శివనాగరాజు మాట్లాడుతూ పార్టీ కోసం మరింత కష్టపడి పనిచేస్తానన్నారు. ఈ సందర్భంగా తనని ఎంపిక చేసిన జిల్లా అధ్యక్షుడు పిక్కి నాగేంద్ర,రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్, ఎంపీ పురందేశ్వరి, ఎమ్మెల్సీ సోము వీర్రాజుకు కృతజ్ఞతలు తెలిపారు.

శివరామకృష్ణ ఎంపిక...

ఉండ్రాజవరం, జూలై 21 (ఆంధ్రజ్యోతి): వేలివెన్ను గ్రామానికి చెందిన బూరుగుపల్లి శివరామకృష్ణ బీజేపీ జిల్లా కార్యదర్శిగా నియమితులయ్యారు. ఈ మేరకు శివరామకృష్ణ సోమవారం విలేకరులకు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో పార్టీని మరింత బలోపేతం చేయడానికి తన వంతు కృషి చేస్తానని పేర్కొన్నారు. ప్రధాన మంత్రి నరేంద్రమోదీ అమలు చేస్తున్న పథకాలను ప్రజల్లోకి తీసుకువెళతానన్నారు.

తల్లీ,కుమార్తె అదృశ్యంపై కేసు

కొవ్వూరు, జూలై 21(ఆంధ్రజ్యోతి): తల్లీ, కుమార్తె అదృశ్యంపై కేసు నమోదు చేసినట్టు మహిళా హెడ్ కానిస్టేబుల్ లలితకుమారి తెలిపారు. పట్టణానికి చెందిన మర్రి ఈశ్వరి, తన సంవత్సరన్నర కుమార్తెను తీసుకుని గతనెలలో ఏలేశ్వరంలోని అత్తగారింటి నుంచి కొవ్వూరుకు వచ్చింది. వారం రోజులు ఇక్కడ ఉన్న తరువాత మళ్లీ ఏలేశ్వరం వెళ్లింది. అప్పటి నుంచి భర్త, అమ్మతో ఫోన్ మాట్లాడుతుండేది. ఇటీవల తల్లి గుడిదాటి దివ్య కూతురుని, మనుమరాలిని చూడడానికి వస్తున్నానని తెలపడంతో నేను ఏలేశ్వరం వెళ్లలేదని తెలిపింది. దీంతో దివ్య పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేయగా మహిళా హెడ్ కానిస్టేబుల్ లలితకుమారి కేసునమోదు చేశారు.

ఉండ్రాజవరం, చాగల్లులో ఉచిత కంటి వైద్యపరీక్షలు



కంటి పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్లు

ఉండ్రాజవరం, జూలై 21 (ఆంధ్రజ్యోతి): ఉండ్రాజవరం బౌద్ధ ధమ్మపీఠంలో సోమవారం వేమగిరికి చెందిన పరమహంస యోగానంద నేత్రాలయం ఆధ్వర్యంలో ఉచిత నేత్ర వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఇందులో సుమారు 180 మంది రోగులు పాల్గొన్నారు. వీరిలో 21 మందికి శస్త్రచికిత్స అవసరమని వైద్యులు గుర్తించారు. కొందరికి ఉచితంగా కళ్లజోళ్లు అందజేశారు. కార్యక్రమంలో బౌద్ధ ధమ్మపీఠాధిపతి అనాలయో, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

చాగల్లు: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం విద్యార్థులకు ఉచిత కంటి వైద్యపరీక్షలు నిర్వహించారు. నిడదవోలు లయన్స్ కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో చాగల్లు, నెలటూరు లయన్స్ క్లబ్ వారి సహకారంతో జరిగింది. శిబిరాన్ని ఏఎంసీ ఛైర్మన్ నాదెళ్ల శ్రీరామ్ చౌదరి చేతులమీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశలోనే కంటి సమస్యలు తెలుసుకుని తగిన జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సభ్యులు పీవీ సత్యనారాయణ, నల్లూరి అప్పారావు, కోడి శ్రీనివాసరావు, ఆళ్ల సత్తిబాబు, గ్రంది రాంబాబు పాల్గొన్నారు.

అసత్య ఆరోపణలు మానుకోండి

● జవహర్ వర్గం నాయకులకు సూచన
● ఎమ్మెల్యే ముప్పిడిని కలిసిన టీడీపీ దళిత నేతలు



ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావును ప్రశ్నిస్తున్న టీడీపీ దళిత నాయకులు

కొవ్వూరు, జూలై 21 (ఆంధ్రజ్యోతి): టీడీపీ నాయకులపై అనవసర ఆరోపణలు చేస్తున్న జవహర్ వర్గం నాయకులపై చర్యలు తీసుకోవాలని సోమవారం టీడీపీ దళిత నాయకులు డిమాండ్ చేశారు. నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావును కలిసి వినతి పత్రం అందజేశారు.నియోజకవర్గ నాయకులను ఇబ్బందులకు గురిచేస్తున్న జవహర్‌ను ఎస్సీ కమిషన్ నుంచి తొలగించాలని నినాదాలు చేశారు. రాష్ట్ర ఎస్సీ కమిషన్ ఛైర్మన్ కె.ఎస్.జవహర్ ఫ్లెక్సీలను తొలగిస్తున్నారని రాజమహేంద్రవరంలో కొంతమంది వైసీపీ మద్దతుదారులు చేసిన అభియోగాలను ఖండించారు. ఎస్సీ కమిషన్ ఛైర్మన్ పదవిని అడ్డుపెట్టుకుని స్థానిక నాయకులపై కేసులు పెట్టాలని జవహర్ చూడడం హాస్యాస్పదంగా ఉందని టీడీపీ దళిత నాయకుడు, ఐటీడీపీ ఇన్‌చార్జి గెల్లా సురేష్ అన్నారు. నియోజకవర్గంలోని దళితులంతా అచ్చిబాబు వర్గమే.. అందరినీ అరెస్టు చేయాలని వరిగేటి కాంతరాజు అన్నారు. పబ్లిక్ ప్రదేశాల్లో పెట్టిన ఫ్లెక్సీలు జీవితాంతం ఉండేలా రాజ్యాంగంలో ఎక్కడైనా చట్టం కల్పించారా అని ప్రశ్నించారు. చట్టం ఉంటే చెప్పి అరెస్టులు చేయాలన్నారు. బొంతా కిశోర్ మాట్లాడుతూ నియోజకవర్గ నాయకులకు బహిరంగంగా క్షమాపణ చెప్పాలన్నారు. అసత్య ఆరోపణలు చేయడం కాదు దమ్ముంటే నియోజకవర్గంలో ఉన్న 47 వేల మంది దళితులను అరెస్టు చేయాలన్నారు. ప్రతాప్ మాట్లాడుతూ ఫ్లెక్సీ వివాదం చిన్నపిల్లల ఆటలా ఉందన్నారు. రాష్ట్ర మాదిగ కార్పొరేషన్ డైరెక్టర్ వేమగిరి వెంకట్రావు మాట్లాడుతూ జవహర్ పదవితో తృప్తి పడడం మా నేసి అందరిని టార్గెట్ చేయడం సరికాదన్నారు. కొక్కిరిపాటి శ్రీహరి మాట్లాడుతూ నియోజకవర్గ దళితులపై కేసులు పెట్టడానికా ఎస్సీ కమిషన్ ఇచ్చిందని విమర్శించారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఈ విషయాన్ని పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్, అధిష్టానం దృష్టికి తీసుకెళ్తానన్నారు.టీడీపీ దళిత నాయకులు అందించిన వినతిపత్రం, ఆధారాలు అధిష్టానానికి పంపిస్తానన్నారు. కొవ్వూరు నియోజకవర్గ టీడీపీలో చిచ్చు పెట్టాలని వైసీపీ నాయకులు కుట్ర పన్నుతున్నారన్నారు. రాజమహేంద్రవరం ప్రెస్‌మీట్‌లో పాల్గొన్న వ్యక్తులు నియోజకవర్గానికి చెందినవారు కాదన్నారు. పశివేదల సొసైటీ ఛైర్మన్‌గా ప్రమాణస్వీకారం చేసిన గారపాటి రామచంద్రరావు ప్రమాణ స్వీకారాన్ని పురస్కరించుకుని ఆ గ్రామంలో ఫ్లెక్సీలు కట్టారన్నారు. ఎవరి ఫ్లెక్సీలు తొలగించలేదన్నారు. అచ్చిబాబు, స్థానిక నాయకులు, కార్యకర్తలపై నిందలు వేయడం తగదన్నారు. ఈ కార్యక్రమంలో మాదిగ కార్పొరేషన్ డైరెక్టర్ వేమగిరి వెంకట్రావు, క్లస్టర్ ఇన్‌చార్జి పెనుమాక జయరాజు, కొప్పాక జవహర్, బొంతా కిషోర్, ప్రతాప్, అయినపర్తి రాజేంద్రప్రసాద్, కౌన్సిలర్లు బొండాడ సత్యనారాయణ, పాలూరి నీలిమ, కండెల్లి రామారావు, కొక్కిరిపాటి శ్రీహరి, మండల తెలుగుయువత సెక్రటరీ పసలపూడి హరిబాబు, కొక్కిరిపాటి వెంకటేష్, మనెల్లి నాని, కె.రాజు పాల్గొన్నారు.

అమ్మవార్లకు సారె సమర్పణ



పశివేదలలో ఆషాఢమాసం సారెను సమర్పించిన మహిళలు

కొవ్వూరు, జూలై 21(ఆంధ్రజ్యోతి): పశివేదలలో వేంచేసియున్న అన్నపూర్ణదేవికి గ్రామస్థులు సోమవారం ఆషాఢమాసం సారెను సమర్పించారు. అన్నపూర్ణ అన్నదాన ట్రస్టు ఆధ్వర్యంలో మహిళలు, తదితరులు సారె, పసుపు కుంకుమ, పువ్వులు, పండ్లు, స్వీట్లు పట్టుకొని ఊరేగింపుగా వెళ్లారు. మహిళా భక్తులు అధికసంఖ్యలో పాల్గొని విశేష పూజలు నిర్వహిస్తూ,భక్తులకు అన్నదానం చేశారు.

తాళ్లపూడి: ప్రక్కిలంకలో వెలసిన మావూళ్లమ్మ వారికి భక్తులు సోమవారం ఆషాఢం సారెను సమర్పించారు. ఆలయ అర్చకుడు కౌతారపు విశ్వనాథశర్మ ఆధ్వర్యంలో గ్రామంలోని మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని గ్రామోత్సవంగా 108 రకాల పిండివంటలతో అమ్మవారికి సారెను అందించారు. అనంతరం ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు మాట్లాడుతూ కార్యక్రమాన్ని ఇంత ఘనంగా జరగడానికి సహకరించిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలియజేశారు.

జవహర్‌ను కలిసిన టీడీపీ నేతలు



జవహర్‌ను సత్కరిస్తున్న నాయకులు

కొవ్వూరు, జూలై 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఎస్సీ కమిషన్ ఛైర్మన్ కేఎస్ జవహర్‌ను దేవరపల్లి మండల టీడీపీ నాయకులు సోమవారం మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా పూలమాలలు వేసి శాలువాలు కప్పి సత్కరించారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు సుంకర దుర్గారావు, నందిగాం బుల్లిరాజు, గద్దె సుబ్రహ్మణ్యం, కరుటూరి శ్రీను, ఎం. ఆదియ్య, ఓ. వాసు, లక్ష్మీ పతి రాజు, మునేశ్వరరావు,తదితరులు పాల్గొన్నారు.

ఆసుపత్రిలో.. చికిత్సపొందుతూ ఒకరి మృతి

కొవ్వూరు, జూలై 21(ఆంధ్రజ్యోతి): ఆసుపత్రిలో చికిత్స పొందుతూ వ్యక్తి మృతిచెందినట్టు కొవ్వూరు రూరల్ ఎస్ఐ కె.శ్రీహరిరావు తెలిపారు. గోవర్ధనగిరిమెట్టకు చెందిన కాంద్రుకోట చిన్ని గత కొంతకాలంగా ఫిట్స్‌తో బాధపడుతున్నాడు. ఈ వ్యాధి వచ్చినప్పుడల్లా తనని తాను గాయపర్చుకుంటూ, ఇతరులను గాయపరుస్తుంటాడని భార్య సుబ్బలక్ష్మి పేర్కొంది. ఈ క్రమంలో 19వ తేదీన ఉదయం ఇంటివద్ద ఉండగా ఫిట్స్ రావడంతో చిన్ని చాకుతో పీక కోసుకున్నాడు. దీంతో అతని భార్య కుమారుడికి సమాచారమందించగా, అతను వచ్చి చికిత్స నిమిత్తం కొవ్వూరు ఆసుపత్రికి తరలించారు. అక్కడ నుంచి మెరుగైన వైద్యం కోసం రాజమహేంద్రవరం తరలించగా, అక్కడ చికిత్సపొందుతూ సోమవారం ఉదయం మృతిచెందాడు. మృతుడి భార్య సుబ్బలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ తెలిపారు.

గంజాయి కేసులో ఏడుగురి అరెస్ట్

నిడదవోలు, జూలై 21 (ఆంధ్రజ్యోతి): గంజాయి కేసులో ఏడుగురు వ్యక్తులు అరెస్టయ్యారు. వివరాల్లోకి వెళితే నిడదవోలు పట్టణంలోని జగనన్న కాలనీలో గంజాయిని కలిగి వున్నారన్న సమాచారం మేరకు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ పీవీజీ తిలక్ ఆదేశాలతో ఎస్ఐ కె.జగన్మోహనరావు తన సిబ్బందితో వెళ్లి దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో ఆ కాలనీకి చెందిన వెలిచర్ల నాగరాజు, ఉజ్జినవారి వీధికి చెందిన చవాన్ పండు, కాకివారి వీధికి చెందిన కాకి కార్తీక్, ఎన్టీ ఆర్ కాలనీకి చెందిన నక్కల రసీల్, శాంతి నగర్‌కు చెందిన మహ్మద్ దస్తగిరి అలియాస్ సమీర్, ఉజ్జినవారి వీధికి చెందిన గేదెల హేమంత్ నాగదుర్గ, చర్చిపేటకు చెందిన దూలపల్లి రాజేష్ కుమార్‌ను అరెస్ట్ చేశామన్నారు. అలాగే వారి వద్ద నుంచి స్వాధీనం చేసుకున్న ఐదు కేజీల గంజాయి సుమారు రూ. 40 వేలు వరకు ఉంటుందన్నారు. వీటితో పాటు రూ. మూడు వేల నగదు ఐదు సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకోవడం జరిగిందన్నారు. రాజమండ్రి హుకుంపేటకు చెందిన పసుపులేటి కీర్తన అనే ఆమె వద్ద నుండి గంజాయిని కొనుగోలు చేసి వీరంతా కాలేజీల వద్ద 50 గ్రాములులు 500 రూపాయిల చొప్పున విక్రయిస్తుంటారని ఆయన తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ కె.జగన్మోహనరావు తెలిపారు.

బైక్‌లు ఢీకొని ఇద్దరికి తీవ్రగాయాలు

కొవ్వూరు, జూలై 21 (ఆంధ్రజ్యోతి): ఎదురెదురుగా బైక్‌లు ఢీకొని ఇద్దరికి తీవ్రగాయాలైనట్టు పట్టణ ఏఎస్ఐ జి.శ్రీనివాస్ తెలిపారు. వేములూరుకి చెందిన కొనగళ్ల సూర్యచంద్రం తన టీవీఎస్ ఎక్సెల్ మీద కొవ్వూరు వస్తుండగా ఎదురుగా వచ్చిన మరో బైక్ ఢీకొట్టింది. దీంతో బైక్‌లపై ఉన్న ఇద్దరికీ తీవ్రగాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం రాజమహేంద్రవరం, అక్కడ నుంచి కాకినాడ ఆసుపత్రికి తరలించారు. సూర్యచంద్రం కుమారుడు ప్రసాద్ ఫిర్యాదుపై కేసు నమోదు చేశారు.